Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 360 | కరీంనగర్ | బుధవారం 20 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

వరంగల్, మే 19 : సరస్వతీ అంత్య పుషరాలు ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు గోదావరి, ప్రాణహిత సరస్వతీ నదుల సంగమ స్థలమైన పవిత్ర క్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో నిర్వహించ నున్నారు. ప్రస్తుతం వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో హనుమకొండ- కాళేశ్వరంమార్గంలో భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, హనుమ కొండ, వరంగల్-1, వరంగల్-2 డిపోల ద్వారా మొత్తం 59 బస్సులు నడుస్తున్నాయని, పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బస్సులు నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీప్రసాద్ తెలిపారు.

## కవాడీగూడాలో దారుణ ఘటన

### - స్పా సెంటర్‌లో భార్యను హత్య చేసిన భర్త

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 :గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని కవాడిగూడలో కట్టుకున్న భార్యను భర్త అతి కిరాతకంగా చంపేశాడు. గొడవ పడి స్పా సెంటర్‌కు వచ్చిన భార్యపై భర్త కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బంగి దేబోరా అనే మహిళ తన భర్తతో కలిసి బహదూర్‌పూర్ కిషన్‌బాగ్‌లో నివసిస్తోంది. కవాడిగూడలోని స్పా సెంటర్‌లో

11 లో

### తెలంగాణలో శాస్త్రీయంగా

# వ్యర్థాల నిర్వహణ

- సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమి దిశగా చర్యలు
- పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి




(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 19 : తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్

11 లో

### యుద్ధప్రాతిపదికన

# పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

- వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం
- ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచ నలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారు లతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం



శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# వీధికుక్కలను తరలించాల్సిందే

- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ప్రతి జిల్లాలో పూర్తిస్తాయిలో బర్త్ కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 19 : వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను

11 లో

### తెలంగాణ కేబినేట్ భేటీ

# 23కు వాయిదా?

- సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం
- 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన
- అధికారికంగా ప్రకటించడమే తరువాయి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 : రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి

11 లో

### వాట్సాప్ మీసేవలో

# మరిన్ని జీహెచ్‌ఎంసీ సేవలు

- అందుబాటులోకి కొత్తగా తొమ్మిది పౌర సేవలు
- డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రభుత్వం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 : జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్, డెత్ హోమ్, ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సావ్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రా నిక్ సర్వీస్ డెలివరీ విభాగం




తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు సందే శం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవు తుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడిం చింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తు న్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం

11 లో

# భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

- పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం వాడకంపై జాగ్రత్తలు
- రైతునేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రైతులకు దిశానిర్దేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 : రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం తో పాటు పంట దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన రైతు నేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 1,600 వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ



11 లో




- జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఎసిబి దాడులు
- సోదాల్లో కుప్పలు తెప్పలుగా నగదు, నగలు స్వాధీనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 : హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా భారీ ఎత్తున నగదు, నగలు, ఆస్తుల చిట్టాలు బయటపడ్డాయి. ఆదాయానికి

11 లో



# డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- ఆధునికి సాంకేతికతపై జర్నలిస్టులకు శిక్షణ
- మీడియా అకాడమీ చర్చలో సీనియర్ జర్నలిస్టుల వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 : నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ, చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలై జేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని

11 లో






# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన ప్రత్యేక ప్రధానకార్యదర్శి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 19 :జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద

11 లో

# ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు పనులను ప్రారంభించిన మంత్రి గడ్డం వివేక్

- రూపురేఖలు మార్చేలా పలు పనులకు శ్రీకారం
- ప్రారంభించిన రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- హాజరైన టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కాట శ్రీనివాస్ గౌడ్, బి జే పి ఎం.ఎల్.సి అంజిరెడ్డి
- పక్షపాతాల్లేకుండా అభివృద్ధికి సహకరిస్తాం. నేతల వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్ చేరు,మే 19 : ఇస్నాపూర్ మున్సిపాలిటీ రూపురేఖలను మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు గురువారం అట్టహాసంగా శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర లేబర్, ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ ఒ ఫ్యాక్టరీస్ మైనింగ్, జియాలజీ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ పలు అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, మున్సిపాలిటీల సమగ్ర వికాసానికి అన్ని విధాలా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ టీ.జీ.ఐ.సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని వారు స్పష్టం చేశారు.

**ఒక్కటైన ఇరుపక్షాలు.. కనిపించిన ఐక్యత**


ఈ కార్యక్రమం ఒక వైపు అధికారికంగా సాగుతూనే.. మరోవైపు రాజకీయ ఐక్యతకు వేదికగా నిలిచింది. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇరుపక్షాల నాయకులు ఒకే వేదికపైకి రావడం విశేషం. కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లు, కీలక నేతలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకు తావులేకుండా కలిసి నడుస్తామని ఇరు పార్టీల ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

**తరలివచ్చిన జనం**

మున్సిపల్ కమిషనర్ వేంకట కిషన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పనుల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్నాపూర్ గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, కాంగ్రెస్ – బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మణుగూరు పీహెచ్‌సీలో వైద్య నిర్లక్ష్యంపై జాతీయ ఎస్టీ కమిషన్ కేసు

- నాలుగేళ్లుగా పరీక్షలు లేకుండానే మందులివ్వడంపై ఆరోపణలు - జిల్లా కలెక్టర్, వైద్యాధికారులకు నోటీసులు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 19 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ జాతీయ ఎస్టీ కమిషన్, న్యూ ఢిల్లీ కేసు నమోదు చేసింది. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్యాధికారులకు కమిషన్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. మణుగూరు మండలం కొత్తకొండాపురం గ్రామానికి చెందిన ఓ బీపీ బాధితుడికి ఆరు సంవత్సరాల క్రితం రక్తపోటు నిర్ధారణ చేసి మందులు ప్రారంభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు సరైన వైద్య పరీక్షలు నిర్వహించకుండా ఒకే రకమైన మందులు అందిస్తున్నారని ఆరోపించారు. గత నాలుగేళ్లుగా ఎటువంటి వైద్య పరీక్షలు లేకుండానే మందులు కొనసాగించడంతో రోగి ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రోగి కుమారుడు పీహెచ్‌సీ బీపీ రికార్డులను పరిశీలించగా సెలవు దినాల్లో కూడా పరీక్షలు నిర్వహించినట్లు నమోదు చేయడం గమనించినట్లు తెలిపారు. దీనిపై సంబంధిత ఆశా వర్కర్‌ను ప్రశ్నించగా, పై అధికారుల సూచనల మేరకు పరీక్షలు నిర్వహించకపోయినా రికార్డుల్లో నమోదు చేసినట్లు చెప్పినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై రెండు నెలల క్రితమే మణుగూరు మెడికల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, బాధితుడికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించలేదని తెలిపారు. పైగా ఫిర్యాదు చేసిన కుటుంబంపై "డబ్బుల కోసం చిల్లర వేషాలు వేస్తున్నారు" అంటూ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తదుపరి వైద్యం కోసం రోగికి సంబంధించిన నెలవారీ నివేదికలు, మందుల వివరాలు ఇవ్వాలని కోరినా, అవి వ్యక్తిగత రికార్డులని చెబుతూ ఇవ్వడానికి నిరాకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయ సూచనల మేరకే వివరాలు ఇవ్వలేమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లేఖ పంపినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై జాతీయ ఎస్టీ కమిషన్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించడంతో, బాధిత కుటుంబానికి ఈ నెల 20న విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే తప్పు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్య నిర్లక్ష్యానికి బాధ్యులైన సిబ్బందిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిని తొలగించాలని బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

# కరీంనగర్ పిఎంజె దొంగతనం కేసు

## ధర్మపురిలో దొంగలు బసచేసిన లాడ్జి సీజ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంగనర్, మే 19 : కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణం దొంగతనం కేసు ధర్మపురిలో మరో కీలక అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దొంగతనానికి పాల్పడ్డ నిందితులు ఈ నెల 1 నుండి 3న ఉదయం 6 గంటల వరకు ధర్మపురిలో బస చేసిన విజయలక్ష్మి లాడ్జ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా సీజ్ చేసారు. ఇంతకాలం ఈ లాడ్జ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తుంటే అధికారులకు కనిపించలేదా..? దొంగలు బస చేసిన తర్వాతే అక్రమాలు గుర్తొచ్చాయా..? ధర్మపురి వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రతీ రోజు వందలాది మంది భక్తులు, యాత్రికులు బస చేస్తుంటారు. అలాంటి ప్రాంతంలో వసతి గృహాలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా..? అతిథుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారా..? సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..? పోలీస్ వెరిఫికేషన్ జరుగుతోందా..? వంటి అంశాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ ఉండాలని అంటున్నారు. కానీ ఘటన జరిగిన తర్వాత మాత్రమే అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదలికలోకి రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒక లాడ్జ్‌ను సీజ్ చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని పలువురు పేర్కొంటున్నారు.

ధర్మపురిలో అనుమతులు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్న ఇతర వసతి గృహాల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దొంగలు రెండు రోజుల పాటు బస చేసినా ఎవరూ అనుమానం వ్యక్తం చేయకపోవడం, వారి కదలికలపై సరైన నిఘా లేకపోవడం భద్రతా వ్యవస్థల వైఫల్యానికే సంకేతంగా కనిపిస్తోంది. ఒక సంఘటన తర్వాత తాత్కాలిక హడావిడి చేయడం కంటే, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థను బలోపేతం చేయడమే ముఖ్యమని ప్రజలు సూచిస్తున్నారు. ధర్మపురి ప్రతిష్ఠ, భక్తుల భద్రత దృష్ట్యా ఇప్పుడు అవసరమైంది ఒక్క లాడ్జ్‌పై చర్య కాదని కఠినమైన సమీక్ష నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# చురుకుగా జనగణన సర్వే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంగనర్, మే 19 : కరీంగనర్ జిల్లాలో చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో జనగణన సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని 17 గ్రామాలకు గాను 70 మంది ఎన్యూమరేటర్స్, 11 మంది సూపర్వైజర్లు జనగణన సర్వేలో పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబానికి 34 ప్రశ్నలతో కూడిన సమాధానాలను నమోదు చేసుకుంటున్నారు. ఇంటి పేరు, కుటుంబ నేపథ్యం, స్థితిగతులు, మౌలిక వసతులు మొదలగు అంశాలను సర్వేలో నమోదు చేసుకుంటున్నారు. జూన్ 9 వరకు జనగణన సర్వే పూర్తి చేయాలని అడిషనల్ చార్జి ఆఫీసర్ ఎంపీడీవో విజయ్ కుమార్ తెలిపారు. కాగా మంగళవారం మండలంలోని చిగురుమామిడి, రేకొండ తదితర గ్రామాల్లో సర్వే పనులను పరిశీలించారు. మండలంలోని ప్రజలు జనగణన సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించాలని వారు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం కొనకపోవడంతో రైతులకు తిప్పలు

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంగనర్, మే 19 : రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా అరిగోస పెడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం పండించిన పంటను కూడా కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్లాల మీదే ధాన్యం కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు కొర్రీలు పెడుతూ ఒక్కో బస్తా మీద నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు తీయడంతో పాటు ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వం వహిస్తున్న అలసత్వం వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పలువురు రైతులు మానసిక క్షోభకు గురై ఆత్మహత్యకు కూడా పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎద్దు ఏడ్చిన యవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదనే సత్యాన్ని గ్రహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గోపాల్‌పేట చేపల మార్కెట్ వినియోగంలో లేదు

- నిరుపయోగంగా మారిన కేంద్రం... - ప్రజాధనం వృథా అవుతోందని విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 19 : గోపాల్‌పేటలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన చేపల మార్కెట్ భవనం ప్రస్తుతం వినియోగంలో లేక నిరుపయోగంగా మారింది. చేపల వ్యాపారులకు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ మార్కెట్ ప్రారంభమైన కొద్దికాలానికే మూతపడినట్లు స్థానికులు చెబుతున్నారు. మార్కెట్ భవనంలో సరైన వసతులు లేకపోవడం, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఉండటంతో వ్యాపారులు అక్కడ వ్యాపారం చేయడానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం. దీంతో చేపల అమ్మకాలు మళ్లీ రోడ్లపైనే కొనసాగుతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు, పరిశుభ్రత లోపాలు పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ కేంద్రం పాడైపోతుండగా, కొన్ని చోట్ల చెత్త పేరుకుపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయలతో నిర్మించిన భవనం ఉపయోగించకుండా వదిలేయడం ప్రజాధనం వృథా



చేసినట్లేనని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు
- కలెక్టర్ చిత్రా మిశ్రా
- పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 19 : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై సమీక్ష చేపట్టారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్, డీసీపీ వెంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, వైద్యాధికారులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ, అవసరమైతే పోలీసు శాఖ సహకారంతో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, మహిళా సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జిల్లాలో ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల్లో పీసీపీఎన్‌డీటీ చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ మాట్లాడుతూ భ్రూణ హత్యలను నివారించడంతో పాటు ఆడపిల్లల పట్ల వివక్ష తగ్గించే దిశగా సమాజంలో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు నుంచి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ప్రకృతి, ప్రశాంతి, భువన, ఎన్జీవో ప్రతినిధులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు..

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 19 : అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అక్రిడికేషన్ దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీతో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, మంగళవారం అక్రెడిటేషన్ మార్గదర్శకాలకు నూతనంగా విడుదలైన నూతన ప్రభుత్వ ఉత్తర్వుల లోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు అందే విధంగా చూడాలని కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమని, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. రఫీక్, డిఎంఎసి కమిటీ సభ్యులు ఎం.డి. షఫీ అహ్మద్, గాదం దేవేందర్, బి.పృథ్వీరాజ్, బండారి లక్ష్మణ్, ఎం.డి. అబ్దుల్ గఫార్, చుంచు రవి, కే.రాజేష్, వడ్లకొండ వీరయ్య, బి.అశోక్, జూనియర్ అసిస్టెంట్ కొత్తపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 19 : జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు ఉద్యాన శాఖ లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలో ఉద్యాన శాఖ, ఆయిల్ పామ్ అంశాలపై నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026–27 సంవత్సరానికి జిల్లాకు 1150 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 370 ఎకరాలకు రైతులు ముందుకు వచ్చి డీడీలు చెల్లించినట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల నుంచి డీడీలు సేకరణ వేగవంతం చేయడంతో పాటు, మొక్కల సరఫరా మరియు డ్రిప్ ఇరిగేషన్ పనులు వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఉద్యాన శాఖ అమలు చేస్తున్న ఇతర పథకాల లక్ష్యాలను కూడా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కూరగాయలు, పండ్ల తోటల సాగును ప్రోత్సహించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డిహెచ్ఎస్ వో జగన్మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జయ్యారంలో బావి మట్టి కూలి ఇద్దరు మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు
- బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రామగుండం, మే 19 : పాలకుర్తి మండలం గ్రామంలో మంగళవారం బావిలో పనిచేస్తున్న కూలీలపై మట్టి కూలిన దుర్ఘటనలో ఇద్దరు చనిపోగా ఒకరికి తీవ్ర గాయాల య్యాయి. గాయపడ్డ కూలిని పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ దుర్ఘటనపై బసంతనగర్ ఎస్సై నూతి శ్రీధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జయ్యారం గ్రామంలో వ్యవసాయ బావిలో కూలీలు ముగ్గురు పూడిక తీస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన బీమ్ హౌస్ అంజి (45) ఇతనికి భార్య జ్యోతి ఒక కొడుకు, ఇదే గ్రామానికి చెందిన సాగర్ల శ్రీనివాస్ వెంకట్రావు చెందిన రేష వెంకీ రాజయ్య 60 సంవత్సరాలు భార్య కొడుకు కూతురు ఉన్నారని పేర్కొన్నారు. సంఘటన స్థలానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించి తగిన న్యాయం చేస్తామని మనోధైర్యాన్ని అందించారు.

# పెళ్లి పేరుతో సింగరేణి అధికారి మోసం

## - పోలీసులను ఆశ్రయించిన మహిళా సింగరేణి ఉద్యోగి
## - కేసు నమోదు చేసిన పోలీసులు -దపరారీలో సింగరేణి అధికారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 19 : సహచర సింగరేణి మహిళా ఉద్యోగిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన సింగరేణి అధికారి ఉదంతం భూపాలపల్లి ఏరియాలో చోటు చేసుకుంది. తోటి మహిళా ఉద్యోగికి మాయమాటలు చెప్పి తీరా నిలదీయటంతో పెళ్లికి నిరాకరించటంతో దిక్కు తోచక తప్పని స్థితిలో పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు భూపాలపల్లి పోలీస్ స్టేషన్లో సదరు సింగరేణి అధికారిపై కేసు నమోదు కాగా పరారీలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి మైన్స్ రెస్క్యూ స్టేషన్లో ఇంచార్జీగా పనిచేస్తున్న కట్ల పూర్ణచందర్ గతంలో కేటికే 1వ గనిలో డిప్యూటీ మేనేజర్గా పనిచేశాడు. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న మహిళా బదిలీ వర్కర్ సన్నిహితంగా మెదలటంతో పాటు పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఈ విషయం గనిలో పుకార్లు, షీకార్లు చేయగా పూర్ణచందర్




కుటుంబ సభ్యులకు తెలియటంతో పలు మార్లు పంచాయతీ నిర్వ హించినట్లు గనికి చెందిన పలువురు చెబుతున్నారు. గత కొన్ని మాసాల క్రితం పూర్ణచందర్ మైన్స్ రెస్క్యూ స్టేషన్కు ఇంచార్జ్గా బదిలీపై రావటం, మహిళా ఉద్యోగికి సైతం యాక్టింగ్ సెక్యూరిటి గార్డుగా పదోన్నతి లభించటంతో జీఎం ఆఫీసుకు బదిలీ చేశారు. ఇరువురు మధ్య ప్రేమాయణం కొనసాగగా, పెళ్లి చేసుకోమని గత కొంత కాలంగా మహిళా ఉద్యోగి ఒత్తిడి చేస్తుండటంతో పూర్ణచందర్ తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు దిక్కు తోచని మహిళా ఉద్యోగి భూపాలపల్లి పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు కట్ల పూర్ణచందర్ పై కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్స్ పెక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. పూర్ణచందర్ కోసం తమ సిబ్బంది గాలిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా సింగరేణి అధికారి పూర్ణచందర్ కు గతంలోనే వివాహం జరుగగా ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్లు సమాచారం.

# జగిత్యాల ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఎంపీ అరవింద్

## - చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చిత్తశుద్ధితో ఉన్నా
## - ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 19 : జగిత్యాల ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ..రాజ్యాంగం కల్పించిన ఫెడరల్ స్ఫూర్తిలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిని రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులు కోరడంలో తప్పేముందని, నిధులు కోరితే ముఖ్యమంత్రిని బిచ్చగాడు అని అంటారా..? అని మండిపడ్డారు. ఇలాంటి వాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నానన్నారు. 05 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం జీఎస్టీ రూపంలో కేంద్రానికి 02 లక్షల కోట్ల పైగా ఇస్తే కేంద్రం మాత్రం 85 వేల కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటులో ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ఎంపీకి బాధ్యత ఉంటుందని, ఇరిగేషన్ శాఖ మంత్రిని కేంద్రీయ విద్యాలయం స్థలం విషయంలో కలవాల్సిన బాధ్యత ఎంపీకి ఉందని తెలిపారు. నేను అనేక సార్లు కలిసి 05 ఎకరాలు కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశానని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం స్థలం సేకరణలో ఎమ్మెల్యే అసమర్థత అంటే, నేను జగిత్యాల నియోజవర్గానికి అవసరమైన జాతీయ రహదారులు, బ్లాక్ స్పాట్ రోడ్డులు, వంతెనలు, జగన్నాద్ పూర్ బ్రిడ్జి నిధులు మంజూరు చేయాలని ఎంపీ అరవింద్, కేంద్ర మంత్రులకు వినతులు ఇస్తే ఇప్పటి సమాధానం లేదని, ఇది వారి అసమర్థత కాదా అని ప్రశ్నించారు. చల్గల్ లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చిత్తశుద్ధితో ఉన్నానని, వాలంతరి అనేది స్వయం ప్రతిపత్తి సంస్థ అని, సంస్థ అభివృద్ధిపై ఎప్పుడైనా ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. స్థలం సాకుతో కేంద్రీయ విద్యాలయం తరలించే ఆలోచన చేయవద్దన్నారు. టిఆర్ నగర్ టీచర్స్ కాలని దగ్గర జాతీయ రహదారికి 200 మీటర్ల దూరంలో 06 ఎకరాల స్థలం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంపీ అరవింద్ జగిత్యాల నియోజకవర్గంపై కనీస అవగాహన లేకుండా అహంకారంతో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ తో రాజకీయం వద్దని హితవు పలికారు. జగిత్యాల నియోజకవర్గంలో అన్ని ఆలయాలకు నిధులు కేటాయించానని, కుల, మత రాజకీయాలు నాకు అలవాటు లేదని స్పష్టం చేశారు. నేడు రాష్ట్రములో అతి పెద్ద సమస్య వడ్లు మక్కల కొనుగోలు అని ఎఫ్ సిఐ ధాన్యం సేకరణలో జాప్యం వల్లనే రైతులకు కష్టాలు అని అన్నారు. టీడీపీ, బీజేపీ అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో కేంద్రం మక్కలు కొనట్లేదని, గడిచిన 06 నెలల్లో ఎఫ్ సిఐ ద్వారా ఎంత ధాన్యం సేకరణ చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. కేంద్రం మద్దతు ధర పెంచి చేతులు దులుపుకుంటుందని, మామిడి మార్కెట్ కోసం వాలంతరీ భూమి 10 ఎకరాలు ఇస్తే ముస్లింలకు ఇచ్చారని అంటారా...90 శాతం మామిడి అమ్మే రైతులు హిందువులు కాదా, హిందూ వ్యాపారులు లేరా అని ప్రశ్నించారు. ఎంపీ అరవింద్ జగిత్యాలపై దృష్టి పెడతా అంటే మంచిది అని, జాతీయ రహదారి వంతెనలు, జగన్నాద్ పూర్ బ్రిడ్జి, బ్లాక్ స్పాట్ రోడ్డులు పూర్తి అయ్యే విధంగా నిధులు మంజూరుపై దృష్టి సారించాలని అన్నారు. నాయకుల ప్రవర్తన,చేసే అభివృద్ధి ప్రజలే చూస్తారని, అంతిమంగా తీర్పు చెప్పేది ప్రజలే అని ,ఒకరినీ టార్గెట్ చేయడం నాయకుల చేతిలో ఉండదని ప్రజల చేతిలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డిపిసిసి సెక్రటరీ బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఏ.నాగభూషణం, గోలి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొలుగోరి దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, సీనియర్ నాయకులు గట్టు సతీష్, ముజీబ్ బాషా, అడువల లక్ష్మణ్, బాల ముకుందం, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీరం రాజేష్, మహిళ కౌన్సిలర్ లు పంబాల సుజాత రాము, ఏనుగుల లావణ్య రాజు, మమత రామకృష్ణారెడ్డి, గంగజల రాజ్ కుమార్, బడుగు పద్మ, కోరే జయ గంగమల్లు, బొల్లరపు స్వప్న గిరిధర్, కౌన్సిలర్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలి

## - గిరిజన ప్రాంతాలకు వంద శాతం విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలి
## - ఖమ్మం కలెక్టర్ దివాకర్ టీఎస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 19 : "జిల్లాలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృత స్థాయిలో పెంచాలి. గిరిజన ప్రాంతాలు, మిగిలిన అన్ని హాబిటేషన్లు, గృహాలకు వంద శాతం విద్యుత్ కనెక్టివిటీ కల్పించాలి" అని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో టీజీఎన్‌పీడీసీఎల్, టీజీ రెడ్‌కో అధికారులతో విద్యుత్ శాఖ పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రత్యేకంగా గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. మిగిలిన అన్ని గృహాలకు విద్యుత్ కనెక్షన్లు కల్పించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అత్యవసరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ల పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి వంద మీటర్లను ఒక బ్లాక్‌గా గుర్తిస్తూ భవిష్యత్తులో నిర్వహణ, మరమ్మత్తులు సులభంగా చేపట్టేలా వ్యవస్థ రూపొందించాలని తెలిపారు. మధిర పట్టణంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా కేబుల్, ఇంటర్నెట్ సేవల సంస్థలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో ఇతర శాఖల పనుల వల్ల భూగర్భ విద్యుత్ లైన్లు దెబ్బతినకుండా స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సబ్‌స్టేషన్ మౌలిక వసతులను నవీకరించాలని, నిర్మాణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించి అవసరమైన భూసేకరణ చేపట్టాలని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద జిల్లాలో రెండు చోట్ల ఒక మెగావాట్ సామర్థ్యంతో సోలార్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందులో ఒకటి పూర్తయిందని, రెండో ప్రాజెక్టు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మోడల్ సోలార్ విలేజ్ పథకం కింద ఖమ్మం జిల్లాలో 27 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిలో బోనకల్ మండలంలోని 22 గ్రామాలు ఉన్నాయని చెప్పారు. గృహ జ్యోతి పథకం లబ్ధిదారుల ఇళ్లలో 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని, అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ప్రజలకు ఆదాయం లభిస్తుందని వివరించారు. మోడల్ సోలార్ విలేజ్‌లలో మొత్తం 9,418 నిర్మాణాల్లో వచ్చే రెండు నెలల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు పూర్తి చేయాలని, 4,371 మంది రైతులకు సోలార్ పంప్‌సెట్లు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ శ్రీనివాస చారి, టెక్నికల్ డీఈ బాబురావు, డీఈలు రామారావు, నాగేశ్వరరావు, రమేష్, భద్రుపవర్, శ్రీనివాసరావు, రెడ్కో జీఎం అజయ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో మక్కజొన్న ధాన్యం కొనుగోళ్లు తరలింపు

## - మక్కజొన్నలు 82వేల 363.900 మెట్రిక్ టన్నులు, 16 లక్షల 47వేల 278 బస్తాల తరలింపు
## - ధాన్యం 89వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు, 73 వేల మెట్రిక్ టన్నుల తరలింపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 19 : స్వయంగా పర్యటిస్తూ ప్రత్యేక అధికారులకు సూచనలు జారీ చేస్తూ నిరంతరం రైతులకు అందుబాటులో జిల్లా యంత్రాంగం,రైతులకు ఇబ్బందులు కలిగిస్తే విధులలో తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటాం అని అన్నారు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో కలెక్టర్ నుంచి కిందిస్థాయి అధికారి వరకు ఆకస్మికంగా పర్యటనల ద్వారా రికార్డు స్థాయిలో జిల్లాలో మక్కజొన్నలు, ధాన్యం కొనుగోళ్ల విషయంలో పక్కా ప్రణాళిక అమలు చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొని వారం రోజుల్లోనే 13 వేల 434 మంది రైతుల 214 కేంద్రాల నుండి 97 వేల 246 మెట్రిక్ టన్నుల ధాన్యంకు గాను 89వేల టన్నుల ధాన్యాన్ని సేకరించి,73 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులు, గోదాములకు తరలించడం జరిగింది. ప్రాథమిక సహకార సొసైటీ, ఐకెపి, గిరిజన కార్పొరేషన్, మెప్మాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రక్రియను పూర్తిగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పర్యవేక్షిస్తూ అధిక హమాలీలను, లారీలను, ట్రాక్టర్స్, ఏర్పాటుచేసి పరిసర ప్రాంతాలలో ఉన్న మిల్లులు గోదాములలోకి తరలించడం కోసం జిల్లా యంత్రాంగం తో పాటు పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా కృషి చేసిందని, ప్రతి కేంద్రంలో అన్ని మౌలిక వసతులు త్రాగునీరు, టెంట్ లు, చేర్లు వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచుతూ, రవాణా చేయు సందర్భములలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ విధంగా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు,మక్కజొన్నలు జిల్లా లక్ష్యం 1 లక్ష, 37వేల 910 మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటివరకు 82 వేల 363 .900 మెట్రిక్ టన్నుల మక్కజొన్నలు 16వేల 059 మంది రైతుల నుండి 16 లక్షల 47 వేల 278 మక్కల బ్యాగులను ఊహించని విధంగా రికార్డు స్థాయిలో కొనుగోలను చేసి తరలించడం జరిగింది, రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లా లో మార్క్ఫెడ్, సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అటు సెంటర్ నిర్వాహకులు ఇటు అధికారుల తో సమన్వయపరుస్తూ కొనుగోళ్లలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ అన్నారు .

# 50 ఎకరాల్లో మార్కెట్ యార్డ్, అగ్రికల్చర్ కాలేజ్ ఏర్పాటు



## - ఉమ్మడి మండలం మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేష్ - ఉమ్మడి మండలం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సత్య శీలా రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 19 : బుద్ధారం-పోలికేపాడు శివారులో 50 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డ్‌తో పాటు అగ్రికల్చర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సిద్ధంగా ఉన్నట్లు ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మంద సత్య శీల రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియామకంతో ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఏ వెంకటేష్, వైస్ చైర్మన్‌గా మంద సత్య శీల రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఉమ్మడి మండల నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఏ వెంకటేష్, వైస్ చైర్మన్ మంద సత్య శీల రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి, ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైస్ చైర్మన్ మంద సత్య శీల రెడ్డి మాట్లాడుతూ మొదట 10 ఎకరాల్లో మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని భావించామని, అనంతరం 25 ఎకరాలకు విస్తరించామని, ప్రస్తుతం పోలికేపాడు గ్రామస్తులు 50 ఎకరాల భూమిని ప్లాట్‌ఫార్ములు, షెడ్లు, అగ్రికల్చర్ కాలేజ్ నిర్మాణం కోసం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అగ్రికల్చర్ కాలేజ్‌కు సంబంధించిన జీఓ కూడా విడుదలైందన్నారు. మండల సింగిల్ విండో డైరెక్టర్ లోడే రాఘు మాట్లాడుతూ ఉమ్మడి గోపాల్పేటను మున్సిపాలిటీగా అభివృద్ధి చేసే బాధ్యతను వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకి వెంకటేష్, వనపర్తి జిల్లా జనరల్ సెక్రటరీ శివన్న, రేవల్లి వడల పర్వతాలు, జిల్లా యూత్ కాంగ్రెస్ ఆర్టీఐ చైర్మన్ కొంకి రమేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# యువత కోసం ప్రత్యేక ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం విజయవంతం

## ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై యువతకు అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, మే 19 : ప్రజా పాలన – 99 రోజుల ప్రగతి ప్రణాళిక" మరియు యువజన క్రీడా వారోత్సవాల్లో భాగంగా యువత కోసం నిర్వహించిన ప్రత్యేక ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై అవగాహన పొందారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు యువతకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో వివిధ నైపుణ్య శిక్షణ కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ అవకాశాలు, భారత ఆర్మీ అగ్నివీర్ నియామక ప్రక్రియపై సమగ్ర వివరణ ఇచ్చారు. యువత తమ భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. యూట్యూబ్ లైవ్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా యువత ఆసక్తిగా వీక్షించినట్లు అధికారులు తెలిపారు.

# పోచారం డివిజన్‌లో ఐమాక్స్ లైట్ల మరమ్మతులు వేగవంతం

## - ప్రజల భద్రత కోసం చర్యలు
## - యువజన కాంగ్రెస్ నాయకుడు వినోద్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్కేసర్, మే 19 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్‌లో పనిచేయని ఐమాక్స్ లైట్ల మరమ్మతు పనులు వేగవంతంగా కొనసాగు తున్నాయి. డివిజన్‌లో దాదాపు 61 ఐమాక్స్ లైట్లు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు స్పందించారు. ఈ సమస్యను ఘట్కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ఘట్కేసర్ సర్కిల్ డీసీ వాణి సహకారంతో వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పోచారం డివిజన్‌లో విలీనమైన ఐదు గ్రామాల పరిధిలోని చౌదరిగూడ, కొర్రేముల మెయిన్ రోడ్లతో పాటు కాలనీల్లో ఉన్న ఐమాక్స్ లైట్ల మరమ్మతులు ప్రస్తుతం కొనసాగు తున్నాయి. రాత్రి వేళల్లో ప్రజలకు సరిపడా వెలుతురు అందేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో యువజన కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని వినోద్ పేర్కొన్నారు.

# కాచవాని సింగారంలో ఘనంగా శ్రీ తుల్జా భవాని-రేణుక ఎల్లమ్మ కళ్యాణం

## - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఘట్కేసర్, మే 19 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ డివిజన్ కాచవాని సింగారంలో శ్రీ తుల్జా భవాని, శ్రీ రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మహర్షుల 4వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బుర్ర లక్ష్మణస్వామి అమ్మవారి ఉపాసకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవానికి మాజీ మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రే రాజేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ కుమార్, బుర్ర మల్లేష్ గౌడ్, బుర్ర శివ సంపత్ గౌడ్ (డిన్ను), బుర్ర యశ్వంత్ గౌడ్ (లిట్టు), లక్ష్మణస్వామి కుటుంబ సభ్యులు, భక్తులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి

## - జనగణన, పారిశుధ్యం, క్రీడా సౌకర్యాలపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఘట్కేసర్, మే 19 : "ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలి. ప్రజాపాలన–ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సమస్యను వేగంగా పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలి" అని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎం.ఎం.సి.) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించిన కమిషనర్ అభివృద్ధి, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సెక్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించి పారిశుధ్య సమస్యల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఘట్‌కేసర్ వార్డ్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో కొనసాగుతున్న జనగణన (సెన్సస్ ఎన్యుమరేషన్) ప్రక్రియను పరిశీలించారు. సర్వే పనులను కచ్చితత్వంతో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎస్‌డబ్ల్యూజీ (సానిటరీ వర్కర్స్ గ్రూప్) కార్మికులతో సమావేశమైన కమిషనర్, వారి సంక్షేమం మరియు భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సిబ్బందికి అవసరమైన సేఫ్టీ గేర్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. తదుపరి ఎదులాబాద్ వార్డ్‌లోని ఊర్వెగడ్డ ప్లేగ్రౌండ్‌ను సందర్శించిన ఆయన, క్రీడాకారులు మరియు స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వాణి, ఇంజనీరింగ్ విభాగం డీఈ నరేష్, శానిటేషన్ విభాగం డీఈ శ్రీనివాస్, ఏఈఈ చంద్రశేఖర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 323 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 19 : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 323 మంది లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు. బొమ్మలరామారం మండలానికి 37, తుర్కపల్లి 42, యాదగిరిగుట్ట మండలం, పట్టణానికి 61, ఆలేరు 22, మోటకొండూరు 28, ఆత్మకూరు 39, రాజపేట 31, గుండాల 29, ఇతర ప్రాంతాలకు 35 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు కొత్త అర్థం తీసుకొచ్చిందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్, పెన్షన్, రేషన్ కార్డు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందిస్తున్నామని తెలిపారు. పథకాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే అధికారులకు లేదా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రజాలక్ష్యం


సంపాదకీయం

# దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి !

మనదేశంలో సరైన విధానాలు లేక పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. సరైన మార్కెటింగ్ ఉండదు. సరైన రవాణా సౌకర్యం ఉండదు. సరైన వేదికలు ఉండవు. మదనపల్లి టమోటాలు పండించినా అవి ప్రజలకు చేరవు. నిజామాబాద్ పసుపు ప్రజలకు భారంగా మారింది. గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చికి పేరొందినా ధర మాత్రం ప్రజలకు ఘాటెక్కిస్తుంది. వడ్లు, మక్కలు, శనగలు పండించినా వాటిని ప్రజలకు చేరవ చేసే యంత్రాంగం ఉండదు. దేశంలో ఏ మూల ఏం పండినా అది మారుమూల ప్రజలకు చేరవేసే సమర్థ వంతమైన మెకానిజం దేశంలో ఇంకా బలపడలేదు. అందుకే రైతులు తమ పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వీలు కలగడం లేదు. వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి, ప్రజలకు చేరవేయడం లేదు. మనదగ్గర మక్కలు పండితే ధరలు రావు. కానీ విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ మాత్రం వందల్లో డబ్బులు పోసి పావుకిలో కొంటాం. అదే మన మక్కను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకో లేక పోతున్నాం. తాజాగా ఆక్వా రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. విజినరీ చంద్ర బాబు కేంద్రానికి లేఖ రాసి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారే తప్ప, అందుకు మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరారు. ఇది మంచి ఆలోచనగానే గుర్తించాలి. అలాగే ప్రజలకు కూడా ఆక్వాను నేరుగా సరఫరా చేయగల గాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపలు, రొయ్యల రైతులకు ఆపన్న హస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడితే ఎలా అన్నది ఆలోచించాలి. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పు కోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుం టున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోదానికి అస్సలు చేతులు రావట్లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే బాదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది రొయ్య రైతులు. మన రొయ్య లపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుంకం బాదింది. ఇక్కడ ధరలు 20–30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోదీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఏపిలో కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టుపట్టడం లేదు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేయడంతో తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఏపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపు లతో జరగాలి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటునూగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిలుకు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతు లను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు దేశీయంగా వీటిని ప్రజలకు చేరవ చేయాలి. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలు కూడా చేర్చాలి. అందుకు ప్రభుత్వాలు కార్యాచరణ చేయాలి. ప్రజల ఆహారంలో మన పంటలు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే, ఏ పంటయినా అమ్ముడు పోతుంది. మనదేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు చేరేలా చేయాలి. అలా చేయకుండా ఎన్ని ప్రకటనలు గుప్పించినా లాభం లేదు. ఇప్పటికీ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు సక్రమంగా రొయ్యలు చేరడం లేదు. రైతులు పండించే పంట లకు సరైనమార్కెటింగ్ వ్యవస్థ లేనంత కాలం ఇలాంటి సంక్షో భాలు ఎదుర్కోవాల్సిందే. అందుకు ప్రభుత్వాలదే బాధ్యత.

# ప్రభుత్వ భూములపై 'అంతర్జాతీయ' కన్ను..!

- ఢిల్లీ పబ్లిక్ స్కూల్' యాజమాన్యంతో చేతులు కలిపిన ఎంఈఓ..?
- అసైన్డ్ భూమిని నొక్కేసి.. 30 ఫీట్ల ప్రభుత్వ రహదారిని వాడుకుంటున్న వైనం
- భవిష్యత్తులో సర్కార్ ల్యాండ్ స్వాధీనం చేసుకుంటే స్కూల్ పరిస్థితి ఏంటి?
- అడ్మిషన్ల దందా సాగుతున్నా... 'పై' అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటి?
- దారే లేని చదువుల తల్లి... రేపటి పిల్లల గతేమి కాను?
- ధనలాభం కోసం నిబంధనలు తుంగలో..
- స్కూల్ అక్రమాలపై స్థానికుల ఫిర్యాదు.. అధికారుల మౌనంపై ప్రశ్నలు"



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్ చేరు, మే 19 : అక్కడ అక్షరాలు నేర్పించాల్సిన విద్యాసంస్థ.. ఆక్రమణల పాఠాలు నేర్చుకుంటోంది! ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే.. కాసుల కక్కుర్తితో ప్రైవేటు శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. నిరుపేదలకు దక్కాల్సిన అసైన్డ్ భూమిని, ప్రభుత్వ రస్తాను ఓ అంతర్జాతీయ పాఠశాల తన స్వార్థానికి వాడుకుంటున్నా.. కంటితుడుపు చర్యలు కూడా కరువయ్యాయి. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 'ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్' ఐ.డి.పీ.ఎస్ వ్యవహారంలో స్థానిక విద్యాశాఖ అధికారి ఏం.ఈ.ఓ స్కూల్ యాజమాన్యం కుమ్మక్కైన తీరు ఇప్పుడు స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది.

## ఎంఈఓ అండ.. స్కూల్ యాజమాన్యం దందా.?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో వెలిసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కి వెళ్లే ప్రధాన ఎంట్రన్స్ రహదారి వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. రూల్స్ ప్రకారం స్కూల్ కి సరైన సొంత దారి లేకపోయినా.. సదరు ఎం.ఈ.ఓ అన్ని నిబంధనలను పక్కనబెట్టి పర్మిషన్లు ఇచ్చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. స్కూల్‌కు దారిగా వాడుకుంటున్న 30 ఫీట్ల రహదారి పూర్తిగా ప్రభుత్వానికి సంబంధించిన 'అసైన్డ్ ల్యాండ్' (ప్రభుత్వ భూమి). సర్కారు జాగాలను కాపాడాల్సిన సదరు అధికారి.. స్కూల్ యాజమాన్యం విసిరిన 'ధన' బాణానికి లొంగిపోయి, ఆ ప్రభుత్వ రహదారిని స్కూల్ ప్రైవేట్ ఆస్తిలా వాడుకునేందుకు పరోక్షంగా సహకరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## రేపు సర్కారు భూమి తీసుకుంటే.. పిల్లల భవిష్యత్తు ఏంటి?

ప్రస్తుతానికి ఎంఈఓ అండతో స్కూల్ యాజమాన్యం ఆ దారి గుండా యథేచ్ఛగా అడ్మిషన్లు స్టార్ట్ చేసి, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయలు గుంజుతోంది. అయితే ఇక్కడే ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతోంది. రేపు భవిష్యత్తులో ప్రభుత్వం ఏదైనా అత్యవసర అవసరం నిమిత్తం లేదా ప్రజా ప్రయోజనాల కోసం ఆ అసైన్డ్ ల్యాండ్‌ను, రహదారిని తన స్వాధీనంలోకి తీసుకుంటే పరిస్థితి ఏంటి?

## ప్రశ్నార్థకంగా స్కూల్ భవిష్యత్తు

ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకుంటే, స్కూల్‌కు వెళ్లేందుకు అసలు దారే ఉండదు. మరి దారే లేని స్కూల్లో చేరిన వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఏం కావాలి? కేవలం ధనలాభమే ధ్యేయంగా నడుస్తున్న ఈ అంతర్జాతీయ స్కూల్.. రేపు దారి మూసేస్తే చేతులెత్తేయడం ఖాయమని స్థానికులు మండిపడుతున్నారు.

## అధికారుల 'మౌన వ్రతం' వెనుక రహస్యమేంటి?

కళ్ల ముందే ఇంత పెద్ద కబ్జా యత్నం జరుగుతున్నా, నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు సాగుతున్నా.. పైస్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న 'అసలు' మర్మమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల మౌనం వెనుక భారీ స్థాయిలో చేతులు మారాయా...? విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు నిద్రపోతున్నారా.. లేక నిద్ర నటిస్తున్నారా.? ఒక అంతర్జాతీయ స్కూల్ లాభాల కోసం ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెడుతుంటే చూస్తూ ఊరుకుంటారా? అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.

## ధనలాభం కోసమే ఈ దందా'..?

### ఇస్నాపూర్ స్థానిక ఇద్దరి వ్యక్తులు రెడ్డిగారి సర్వోత్తం రెడ్డి, మంగలి అశోక్ తీవ్ర ఆగ్రహం



ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఈ భూ అక్రమ వ్యవహారాన్ని, అధికారుల తీరును ఇస్నాపూర్ స్థానిక వ్యక్తులు రెడ్డిగారి సర్వోత్తం రెడ్డి, మంగలి అశోక్. ఇస్నాపూర్ వాసులు తీవ్రస్థాయిలో ఖండించారు. ప్రభుత్వ జాగలను, పేదల అసైన్డ్ భూములను రక్షించాల్సిన అధికారులే ఇలా అంతర్జాతీయ స్కూల్ యాజమాన్యాల ధన లాభానికి అమ్ముడు పోవడం సిగ్గుచేటు. ఏం.ఈ.ఓ పూర్తి స్థాయిలో కుమ్మక్కై ఈ కబ్జా యత్నానికి సహకరిస్తున్నారు .? అంటూ అసైన్ భూముల్లో నుండి రహదారులు వేసుకొని కార్పొరేట్ దందా కొనసాగిస్తుంటే పై స్థాయి అధికారులు మౌనం వహించడం లో ఆంతర్యం ఏమిటో సమాధానం చెప్పాలి.అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వదిలి, తక్షణమే స్పందించి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అనుమతులపై, ఆక్రమిత రహదారిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ భూముల రక్షణ కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ 'అంతర్జాతీయ' అక్రమ రస్తా దందాపై చర్యలు తీసుకుంటారో.. లేదో వేచి చూడాలి.

# రామగుండం విద్య, వైద్య ఉపాధి కల్పన కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది

## ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్







(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 18 : రామగుండం నగరం విద్య, వైద్య,ఉపాధి కల్పనా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 31, 32, 33, 35, 36, 37, 38, 39, 40, 43, 44, 45, 50, 53, 55, 60 తదితర డివిజన్‌లలో డి.ఎం.ఎఫ్.టి నిధులు రూ 7.30 కోట్లతో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులకు మేడిపల్లి రోడ్‌లో మంగళ వారం నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామితో కలిసి శిలా ఫలకం ఆవిష్కరించి ఆయన శంఖుస్థాపన చేశారు.

ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం తెలంగాణ రాష్ట్రంలోనే ఒక అద్భుత నగరం గా రూపు దిద్దుకుంటున్నదని అన్నారు. ఓపెన్ కాస్ట్ కారణంగా మేడిపల్లి ప్రాంతశీ కోల్పోయిన వైభవాన్ని తిరిగి తేవడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు, సువిశాలమైన రహదారులు , అన్ని మౌళిక వసతుల కల్పన తో పాటు మూత పడిన ఓపెన్ కాస్ట్ లో పంపింగ్ స్టోరేజ్ తో విద్యుత్ తయారు చేసే పరిశ్రమ సింగరేణి ద్వారా స్థాపించనున్నామని అన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంత భూములకు మరింత డిమాండ్ పెరగడంతో పాటు ఉపాధి కల్పన లభిస్తుందని అన్నారు. డబల్ బెడ్ రూమ్ లకు పది కోట్ల రూపాయలు వెచ్చించి సకల సదుపాయాలు కల్పించి ఉపయోగంలోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. పి.కె. రామయ్య కాలనీలో కూడా రెండేళ్ల కాలంలో విశాల రహదారులతో పాటు సకల సౌకర్యాలు కల్పించామని అన్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిపై పై ప్రత్యేక దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో ఇరవై డివిజన్ లకు చెందిన కార్యక్రమానికి మేడిపల్లి గ్రామశీలో వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రామగుండం నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, అధికారులు సహకరిస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు త్వరలోనే ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల బీమా పథకం కూడా అమలు చేయనున్నారని అన్నారు. అర్హులందరికీ చేయూత ఫించన్లు అందుతాయని అన్నారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి స్వంత ఇంటి కల నెరవేరుస్తామని అన్నారు.


రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎన్‌టిసిసి సంస్థ ప్రభావిత ప్రాంతం లో ఖర్చు పెట్టాల్సిన సి ఎస్ ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు తరలి పోతుంటే గతంలో ఉన్న ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదని అన్నారు. రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యే అయిన తరువాత సిఎస్ఆర్ నిధులతో పాటు అనేక నిధులు వెచ్చించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. భూ నిర్వాసితులు, పేదలకు న్యాయం జరగాలని ఎమ్మెల్యే ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారని అన్నారు. ఎన్‌టిపిసిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఎమ్మెల్యేగా రాజ్ ఠాకూర్ ఎన్నికయిన తరువాతనే ప్రారంభం అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ, ఎస్ఇ గురువీర, కార్పొరేటర్లు సాహెదా ఆసిఫ్ పాషా, మీర్జా ఫజల్ బేగ్, వెంగళ బాపు, మెరుగు భూ లక్ష్మీ, కొలని కవిత, కంకణాల మౌనిక, స్వప్న ప్రియ, మానస, ధూళి కట్ట సతీశ్, ముస్తఫా, తాళ్ల పెల్లి యుగంధర్, ఎంఆర్ఓ రవీందర్, వివిధ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిని చూసి వలస వెళ్లిన వారు తిరిగి రావాలి

నగరం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారంతా మళ్ళీ తిరిగి రావాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పిలుపు నిచ్చారు. డిఎంఎఫ్‌టి నిధులు రూ 1.80 కోట్లతో రామగుండం 30వ డివిజన్ లో పవర్ హౌజ్ నుండి మజీద్ టర్నింగ్ వరకు పాత ఎ.సి. పైప్ లైన్ తొలగించి కొత్త పైప్ లైన్ వేసే పనులకు మేయర్ మహంకాళి స్వామితో కలిసి ఆయన మంగళవారం మజీద్ కార్నర్ వద్ద శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పన, ఇంటి గ్రేటెడ్ స్కూల్, ప్రభుత్వ పాటశాల నూతన భవనం , గ్రంధాలయం తదితర అభివృద్ధి పనులు సుమారు వెయ్యి కోట్ల రూపాయలతో పాటు పదహారు వేల కోట్ల రూపాయలతో విధ్యుత్ కర్మాగారం నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా రామగుండం ప్రాంతం భవిష్యత్తులో ప్రదాన కేంద్రం అవుతుందని అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించి పది మందికి అన్నం పెట్టిన ఈ ప్రాంతాన్ని మళ్ళీ ఆ వైభవం వచ్చేలా చేసి పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటానని అన్నారు. భవిష్యత్ పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రదాన రహదారులు వెడల్పు చేయడం జరుగుతున్నదని అన్నారు. రోడ్డు వెడల్పు లో భాగంగా దుకాణాలు కోల్పోయిన వారు ఎవరూ చింతించ వలసిన అవసరం లేదని వారు పక్కా భవనం నిర్మిశీచుకోవడానికి సహకారం అందజేస్తామని అన్నారు. అన్ని ప్రాంతాల నుండి రామగుండం కు సులభమైన రవాణా సౌకర్యం ఏర్పడితే క్రమేపీ అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో అనుకున్న పనులు అన్నీ పూర్తి చేసి రామగుండం నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎం ఎల్ ఎ తనకు జన్మ నిచ్చిన ఊరును అభివృద్ధి చేసుకోవాలనే తలంపుతో రామగుండం కు ఇతర డివిజన్‌ల కంటే ఎక్కువగా ప్రత్యేకంగా నిధులు కేటాయించారని అన్నారు. తద్వారా గత రెండేళ్ల కాలంలో రామగుండం రూపు రేఖలు మారిపోయాయని అన్నారు. దూర దృష్టితో, ప్రణాళికా బద్ధంగా రామగుండం అభివృద్ధికి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పని చేయడం జరుగుతుందని అన్నారు. బి పవర్ హౌజ్ నుండి రామగుండం పట్టణానికి విశాలమైన రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్, రైల్వే స్టేషన్ ఎదుట షాపింగ్ కాంప్లెక్స్ ఇందుకు నిదర్శనమని అన్నారు. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆయనను కడుపులో పెట్టి చూసుకోవల్సిన భాద్యత ఇక్కడి ప్రజలపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ ఇసంపెల్లి అంజయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె, అరుణ శ్రీ, ఎస్ఇ గురువీర పాటు కార్పొరేటర్లు సిరేశెట్టి సతీష్, వడ్లూరి రవి, చిదురాల నాగరాజు, నాయకులు సలీం, మహమ్మద్, వాజీద్ ఖాన్, ఎంఆర్ఓ రవీందర్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతున్నాం : భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మే 19 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నామని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, హమాలీ, రవాణా తదితర ఏర్పాట్లు సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు . జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్యాక్స్ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు మొత్తం 3,76,288 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 2,19,729.5 క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో 1,56,558.5 క్వింటాళ్ల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు తెలిపారు . మంగళవారం ఒక్కరోజులోనే 10,091.5 క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించినట్లు తెలిపారు. రవాణా కోసం 458 లారీలు, 131 ట్రాక్టర్లు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అదనంగా మరో 1,50,000 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇల్లందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, జూలూరుపాడు, గుండాల, అల్లపల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న మొక్కజొన్నను త్వరితగతిన గోదాములకు తరలిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని అన్నారు . రైతుల ఖాతాల్లో చెల్లింపులు వేగంగా జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారితే కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరం

## - కార్మిక హక్కుల కోసం టీజీబీకేఎస్ పోరాటం తప్పదు
## - టీజీబీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కెంగర్ల మల్లయ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 19 : "సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారితే కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. కార్మిక హక్కులను కాపాడటంతో పాటు సింగరేణి సంస్థను రక్షించేందుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య (టీజీబీకేఎస్) రాజీలేని పోరాటం చేస్తుంది" అని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య అన్నారు. మంగళవారం భూపాలపల్లి కోల్‌బెల్ట్ ప్రాంతంలో పర్యటించిన ఆయన కేటీకే ఓసీ-3, కేటీకే-8 ఇంక్లైన్ గనుల్లో కార్మికులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి ఏరియా స్టోర్‌లో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీజీబీకేఎస్‌ను స్థాపించినట్లు తెలిపారు. కార్మికుల నుంచి తమ సంఘానికి విశేష ఆదరణ లభిస్తోందని, గతంలో కార్మిక హక్కుల కోసం తాము చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ కార్మికులు సంఘానికి మద్దతు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. మే 4వ తేదీన తల్లి సమ్మక్క సన్నిధిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్యను స్థాపించామని తెలిపారు. అదే రోజున 1774లో భారతదేశంలో తొలి బొగ్గు తవ్వకాలు ప్రారంభమైన చారిత్రాత్మక దినమని, బొగ్గు గని కార్మికుడి పుట్టినరోజుగా భావించి ఆ రోజునే సంఘాన్ని ప్రారంభించామని చెప్పారు. సింగరేణికి రావాల్సిన రూ.51 వేల కోట్ల బకాయిలు రాకపోవడంతో సంస్థ ఆర్థికంగా కుదేలవుతోందని మల్లయ్య ఆరోపించారు. ఒకప్పుడు బ్యాంకుల్లో భారీ డిపాజిట్లు ఉన్న సింగరేణి, నేడు ఉద్యోగుల జీతాలు చెల్లించేందుకు అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. సింగరేణికి రావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు. సింగరేణి ప్రైవేటీకరణ జరిగితే కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. కార్మికుల సంఖ్య తగ్గించే కుట్రలు జరుగుతున్నాయని, పనిభారం పెంచుతూ యాజమాన్యం కొత్త నిబంధనలు తీసుకొస్తోందని విమర్శించారు. 150 మస్టర్ల సర్క్యులర్ పేరుతో కార్మికులపై అదనపు ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను అణగదొక్కే ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు టీజీబీకేఎస్ బలమైన పోరాటాలు చేస్తుందని, సింగరేణి పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని తెలిపారు. కార్మికుల ప్రేమ, ఆదరణ తమకు మరింత బాధ్యతను పెంచిందని, ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డివిజన్ నాయకులు మంద సంపత్, మాలోత్ ప్రేమ్ సింగ్, ముస్కె లక్ష్మణ్, రాకేష్ రెడ్డి, సాంబయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం అందిస్తాం

## ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 19 : రామగుండం నగర ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బి పవర్ హౌస్ నుంచి మజీద్ టర్నింగ్ వరకు ఉన్న పాత 500 ఎంఎం పైపులైన్ స్థానంలో 1.80 కోట్ల అంచనా వ్యయంతో పనులను చేపట్టామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం రామగుండం మజీద్ చౌరస్తాలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలకు నిరంతరం నాణ్యమైన తాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పాత పైపులైన్ల కారణంగా తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని దశలవారీగా మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ నూతన పైపులైన్ ఏర్పాటు పూర్తయిన తర్వాత నీటి సరఫరా మరింత మెరుగుపడు తుందన్నారు. లీకేజీలు తగ్గి ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. రామగుండం పట్టణాన్ని 300 కోట్లతో రోడ్ల నిర్మాణం లైటింగ్ సిస్టం డ్రైనేజీ నిర్మాణాలు చేస్తున్నామని కళ్ళముందు చేస్తున్న అభివృద్ధి కనిపిస్తుందని అన్ని మౌలిక వసతులతో రామగుండాన్ని అభివృద్ధి గుండంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, 25వ డివిజన్ కార్పొరేటర్ సతీష్ గౌడ్, 30 డివిజన్ కార్పొరేటర్ ఇసంపల్లి అంజులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

## - తెలంగాణ అస్తిత్వానికి రక్షణ కవచంగా కార్యకర్తలు నిలవాలి
## - మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 19 : సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని, తెలంగాణ అస్తిత్వానికి రక్షణ కవచంగా కార్యకర్తలందరు నిలవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, సభ్యత్వ నమోదులో సాకులు చెప్పి అలసత్వం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు. పార్టీ పట్ల విధేయత, అంకితభావం, నాయకత్వంపై విశ్వాసం కలిగిన కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో దుష్ప్రచారం కారణంగా ఓటమి ఎదురైందని పేర్కొంటూ, కార్యకర్తల శిక్షణే పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. తెలంగాణ సోయి లేని పాలకుల వల్ల రాష్ట్ర అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతోందని విమర్శించిన ఆయన, సభ్యత్వ నమోదును సుసంపన్నం చేసి ఆత్మవిశ్వాసం కలిగిన కార్యకర్తలను తయారు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల్లో ఉండే నాయకులకే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు తెలంగాణ అస్తిత్వానికి రక్షణ కవచంగా నిలవాలని అన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 25 వరకు జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఓట్ల తొలగింపులు, చేర్పులు, మార్పులపై జాగ్రత్త వహించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వ హామీల అమలుపై ఆయన విమర్శలు గుప్పించారు. రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, గొర్రెల పంపిణీ వంటి పథకాలు నిలిచిపోయాయని ఆరోపించారు. రైతులు యూరియా కోసం క్యూలలో నిలబడుతున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, జగదీశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎక్కువ తూకం వేస్తే చర్యలు

## - లోడింగ్, ఆన్ లోడింగ్ త్వరగా కావాలి
## - జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 19 : సివిల్ సప్లై, రవాణా, డిఆర్డీఓ, సహకార తదితర శాఖల అధికారులు అలాగే కేంద్ర నిర్వాహకులు సమన్వయముగా పని చేయడంతో పాటు అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ లు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి అయ్యేలా బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం రేగోడు మండలంలో ఏర్పాటు చేసినగూజూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అకస్మికంగా సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్,ట్యాబ్ ఎంట్రీ ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నీ కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు కావాలని,41 కేజీ కంటే ఒక్క గింజ ఎక్కువ తూకం వేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరిపడా హమాలీ లని పెట్టుకొని కాంట ప్రక్రియ త్వరగా కావాలని ప్రతీ కేంద్రానికి సరిపడా ట్రక్ లను ఏర్పాటు చేశామని ఆలస్యం చేయకూడదని వెంట వెంటనే కాంట అయిన ధాన్యం ట్రక్ లోకి లోడింగ్ చేపించాలన్నారు.అలాగే ట్యాబ్ ఎంట్రీ కూడా ఎప్పటికప్పుడు కావాలని పెండింగ్ లో పెట్టకూడదన్నారు. మిల్లర్లు కూడా సరిపడా గోదాం లను ఏర్పాటు చేసుకొని ట్రక్ లు రాగానే ఆన్ లోడింగ్ త్వరగా చేసుకోవాలని కొనుగోలు కేంద్రాలలో ఉండే ధాన్యం త్వరగా మిల్ లకు చేరేలా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కైదమ్మ కుంట చెరువును సుందరశోభితవనంగా తీర్చిదిద్దుతాము

## పిఎసి చైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





శేరిలింగంపల్లి. మే 19 : కైదమ్మ కుంట చెరువును సుందర శోభితవనంగా తీర్చిదిద్దుతామని పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని కైదమ్మ కుంట చెరువు, ఈర్ల చెరువు సుందరికరణలో భాగంగా నెక్సస్ సెలక్ట్ మాల్స్ కంపెనీ వారి సీయస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువు పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను ఇరిగేషన్, సీఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైదమ్మ కుంట చెరువు, ఈర్ల చెరువు దశ దిశ మారునని, వర్షాకాలం లోపు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, కైదమ్మ కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు మరియు సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్ధవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కైదమ్మ కుంట చెరువుకు నేటితో దశ దిశ మారిందని, ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరుతుందని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మురికి కూపంలాంటి చెరువు స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చేరువుగా తీర్చిదిద్దాడమే ధ్యేయంగా పని చేసి నిరూపించడం జరుగుతుందన్నారు. చెరువు పునర్జీవనం తరువాత సుజల జలంతో అపురూప దృశ్యకావ్యంగా ఆవిష్కృతమవుతుందని అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. చెరువు కట్ట చుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఏఈగులాం, సీఎం సి ఇంజనీరింగ్ విభాగం అధికారులు డి ఈశ్రీదేవి, ఏ ఈ ప్రతాప్, సి ఎస్ ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ ,సుదేశ్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయంగా మందుల సరఫరా

## మెదక్ జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చంద్రకళ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 19 : అఖిల భారత ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపు మేరకు 20-05-2026 తేదీన నిర్వహించనున్న బంద్ కారణంగా మెదక్ జిల్లాలోని మెడికల్ షాపులు ఎక్కువగా మూసివేయబడే అవకాశం ఉందనీ, ప్రజలకు అవసరమైన అత్యవసర మరియు ప్రాణరక్షక మందుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తరపున ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయబడిందనీ మెదక్ జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ చంద్రకళ తెలిపారు. అత్యవసర మందుల అవసరమైతే ప్రజలు ఈ హెల్ప్ డెస్క్ నంబర్లు 9440155858, 9440025572, 9985466335 సంప్రదిం చాలని కోరారు. అలాగే 1800-599-6968 డీసీఏ హెల్ప్‌లైన్ నంబర్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, మెదక్ జిల్లా నెంబర్ 8333818140 సంప్రదించాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లాలోని ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న అన్ని ఫార్మసీలు మందులు సరఫరాకు అందుబాటులో ఉంటాయనీ, ప్రజలు ఆందోళన చెందకుండా అవసరమైన సేవలను వినియోగించుకోవాలని మెదక్ జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చంద్రకళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# సహకార బ్యాంకు బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## - రైతులకు, సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు సులభం - ఎమ్మెల్యే మురళి నాయక్
## - డీసీసీబీ నూతన శాఖను ప్రారంభించిన ఎమ్మెల్యే - కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్, మే 19 : రైతులకు, సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు సులభతరం చేసేందుకు సహకార బ్యాంకు బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మురళి నాయక్ పేర్కొన్నారు. నెల్లికుదురు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిసిసి బ్యాంకును ఎమ్మెల్యే డా.భూక్యా మురళి నాయక్ మంగళవారం ప్రారంభించారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల్లికుదురు మండల ప్రజలకు ముఖ్యంగా నిరుపేద రైతులకు సామాన్య ప్రజానికానికి బ్యాంకింగ్ సేవలను మరింత వేగంగా పారదర్శకంగా అందించేందుకు ఈ నూతన శాఖా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సహకార రంగం బలోపేతానికి రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. డిసిసి బ్యాంకు తక్కువ వడ్డీకే రైతులకు పంట రుణాలు ,బంగారు రుణాలు అందిస్తుందని, పేద మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తుందని, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలను కూడా డీసీసీబీ బ్యాంక్ సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి చైర్మన్,డిస్టిక్ కో ఆపరేటివ్ అధికారి వెంకటేశ్వర్లు, డిడియం, రామ్ చౌరి, నెల్లికుదురు డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ శోభన్, నెల్లికుదురు గ్రామ సర్పంచ్ పులి వెంకన్న, ఛైర్మన్లు, జిల్లా ముఖ్య నాయకులు,మండల పార్టీ అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంను మంగళవారం నెల్లికుదురు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ 20 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హత్యయత్నం కేసులో నిందితునికి 4 ఏళ్ల జైలుశిక్ష రూ. 11వేయిల జరిమానా


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), మే 19 : మద్యం షాపులో జరిగిన గలాటా లో పులిరాజు పారుపల్లి శ్రీనివాస్ పై పగిలిన బీరు సీసా తో దాడి చేసిన కేసులో నిందితుడికి నాలుగు యేండ్ల జైలు శిక్ష, పదకొండు వేయిల రూపాయల జరిమానా విధించారు. 8 ఇంక్లైన్ కాలనీ కి చెందిన పట్టమరపు దావీదు పై నేరం రుజువు కావటం తో 4 సంవత్సరాల జైలు శిక్ష ,11 వేల రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి జీవన్ సూరజ్ సోమవారం తీర్పు నిచ్చారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం. 8 ఇంక్లైన్ కాలనీ లో ని ఓ వైన్ షాప్ లో ,2022 సంవత్సరం నవంబర్ 29న కాలనీ లో వైన్ షాప్ లో నిందితుడైన దావిదు,కొల్లి రాజు లు మద్యం సేవిస్తూ ,మద్యం సీసా లు ఎత్తి వేస్తూ గలాటా సృష్టిస్తుండగా అక్కడి ఉన్న పులి రాజు వారించాడు. దీంతో కక్ష పెంచుకున్న దావిదు మద్యం షాప్ నుంచి బయటకు వచ్చి పగిలిన బీరుసీసా తో పులిరాజు ఎడమ వైపు మెడ మీద 3 సార్లు పొడిచాడు. అప్పుడే వద్దని వా రించిన పిర్యాదు దారుడు పారుపల్లి శ్రీనివాస్ ను సైతం పెదవి పై అదే సీసా తో గాయపర్చాడు. శ్రీనివాస్ పిర్యాదు మేరకు అప్పటి 2 వ టౌన్ సీఐ అఫ్జలుద్దీన్ కేసు నమోదు చేసుకోగా ప్రస్తుత రెండవ టౌన్ సీఐ ప్రసాదరావు,ఆధ్వర్యం లో కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ఎలిగేటి మల్లేశం 11 మంది సాక్షులను కోర్ట్ లో ప్రవేశ పెట్టగా ,సెషన్స్ కోర్ట్ అదనపు పబ్లిక్ ప్రాసెక్యూటర్ చెలికల పద్మజ తన వాదనలు వినిపించగా నిందితుని పై నేరం రుజువు కాగా న్యాయమూర్తి శిక్ష ఖరారు చేస్తూతీర్పునిచ్చారు. నిందుతుని కి శిక్ష పడటానికి కృషి చేసిన ప్రాసిక్యూషన్ టీమ్ ని ఖని ఏసీపీ మడత రమేష్,సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందనలు తెలిపారు.

# వర్గ పోరాటాల మార్గదర్శి పుచ్చలపల్లి సుందరయ్య

## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఏండి జహంగీర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 19 : వర్గ పోరాటాల మార్గదర్శి పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రజా పోరాటాల్లో పాల్గొనాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సుందరయ్య 41 వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు 12వేల హామీ నెరవేర్చాలి అని, భువనగిరి తాలూకా ప్రాంతంలో 2వేల ఎకరాలు భూ పంపిణి కమ్యూనిస్ట్ ల పోరాట ఫలితం అని నాడు వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సుందరయ్య చేసిన ఉద్యమం త్యాగం మరువలేనిది అని వారు గుర్తు చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనేక రకాల ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ మహిళా యువజన విద్యార్థి వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని పేదలకు పెనుశాపం బీజేపీ పాలనా విధానాలు ఉన్నాయని వారు అన్నారు. సుందరయ్య జీవితాన్ని నేటి తరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని వారు పిలునిచ్చారు. వీరితోపాటు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, రాంబాబు, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల ఆరోగ్యం ప్రతి ఒక్కరి బాధ్యత

### ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 19: మండే ఎండ తీవ్రతను భరిస్తూ శ్రమిస్తున్న ఉపాధి హామీ కూలీల ఆరోగ్యం మనందరి బాధ్యత అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు మంగళవారం పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి ఇబ్బందులను తెలుసుకొని మాట్లాడారు ఎండ తీవ్రత నుంచి కూలీలు ఉపశమనం పొందేం దుకు తాగునీరు ఓ ఆర్ ఎస్ మజ్జిగ పాకెట్లు వీటికి తోడు టోపీలను ధరించాలని అందుకే ఈరోజు మీ అందరితో కలిసి ఇవి అందించానికే వచ్చానని మీ క్షేమమే నాకు ముఖ్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అర్హులైన వారందరికీ అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు రైతులతో ముచ్చటిస్తూ వ్యవసాయ పరిస్థి తులు పంటల సాగు నీటి వసతి తదితర అంశాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడం దేవమ్మ బాపు కాంగ్రెస్ అను బంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## రెస్క్యూ స్టేషన్ ను తనిఖీ చేసిన డిఎంఎస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 19 : సింగరేణి ఆర్జీ-2 ఏరియాలోని మైన్స్ రెస్క్యూస్టేషన్ ను మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అశోక్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ప్రేమ్ కుమార్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెస్క్యూ జిఎం కె.శ్రీని వాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన సింగరేణి రెస్క్యూ జట్టును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పురుషులకు దీటుగా మహిళా ఉ ద్యోగులు సైతం రెస్క్యూలో రాణించడం అభినందనీయమని, రానున్న రోజుల్లో అంత ర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెస్క్యూ సూపరిండెంట్ జి.రాజేందర్ రెడ్డి, డాక్టర్ ఈ.రాజేశ్వరరావు, ఇన్ స్ట్రక్టర్ ఎం.తిరుపతి, ఎ.నర్సింహ మూర్తి, రెస్క్యూ బ్రిగేడియర్స్ పాల్గొన్నారు.

## ఆదర్శ కమ్యూనిస్టు సుందరయ్య ఆశయాలే మనలక్ష్యం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రామగుండం, మే 19 : కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట రథసారధి పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల లక్ష్యమే మన ముందున్న కర్తవ్యం అని సిపిఎం అంతర్గాం మండల కార్యదర్శి అడారి నరసింహారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఎగరేసి మాట్లాడారు. పేద ప్రజల పక్షాన చివరి ఊపిరి వరకు పోరాడిన గొప్ప నాయకుడని కమ్యూనిస్టు శ్రేణులకు దిక్సూచిగా నిలిచిన పుచ్చలపల్లి సుందరయ్య మార్గం కమ్యూని స్టులదని నర్సింగరావు గుర్తు చేశారు. నిరాడంబరత ఆదర్శవంతం ఆయనకే సొంతమని, దేశంలో దోపిడీ లేని సమాజం స్థాపించేం దుకు అలుపెరుగని పోరాటం చేసిన ఆదర్శమూర్తి అని, ఆయన ఆశయాల బాటలో నడవడమే మన మిచ్చే నిజమైన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతుల పోచం, తమ్మన వేణి, శంకర్, కండ్లే శంకర్,కండ్లే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు జోగు రాములు మృతి

### - తోటి పాత్రికేయుల నివాళి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే, 19 : గోపాలపేట మండల్‌లో స్థానికంగా విధులు నిర్వహిస్తున్న వి6 రిపోర్టర్ అనారోగ్యం కారణంగా మృతి చెందడం పాత్రికేయ లోకంలో విషాదాన్ని నింపింది. మృతి చెందిన జర్నలిస్టుకు తోటి మిత్రులు, పాత్రికేయులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. పాత్రికేయ వృత్తిలో నిబద్ధతతో పనిచేసిన ఆయన ప్రజా సమస్యలపై ఎన్నో కథనాలు వెలుగులోకి తీసుకు వచ్చారని సహచరులు గుర్తుచేశారు. మృతి వార్త తెలిసిన వెంటనే వివిధ గోపాలపేట మండల్ చెందిన జర్నలిస్టులు ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు మిత్రులు మాట్లాడుతూ, ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి ధైర్యం చెప్పుతూ అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనం తరం రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులు అర్పించారు.

## కానగంటి మంజుల కుటుంబానికి మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ భరోసా

### - మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గుండాల, మే, 19 : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం గ్రామంలోని వార్డు మెంబర్ కానగంటి మం జుల కరెంట్ షాక్‌తో మరణించింది. విషయం తెలుసుకున్న అబ్బా స్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అలాగే 5016 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్య క్రమంలో మాదిరెడ్డి అంజిరెడ్డి, ఉప సర్పంచ్ ఎలగందుల నవీన్, మాదూరి నరేష్ రెడ్డి, దొడ్డబోయిన సురేష్, ఫౌండేషన్ ఇంచార్జ్ మలిపెద్ది విక్రమ్ రెడ్డి, మల్లెపాక మదన్ మోహన్, మల్లె పాక పరుశరాములు గ్రామస్తులు తదితులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, మే 19 : పెద్దపల్లి మండల జాగృతి మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సాధికారత, హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ దయా అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్) పాటించడం ఆరోగ్య పరిరక్షణకు ఎంతో అవసరమని తెలిపారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 14567, 155326 గురించి వివరించి, మహిళలు, చిన్నారులు అవసర సమయంలో నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. మిషన్ వాత్సల్య పథకం, బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. మహిళలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏపీఎం సిహెచ్.శాంతి, మండల సమాఖ్య కార్యాలయ బేరియర్స్, వీఓ ఆఫీస్ బేరియర్స్, మహిళలు పాల్గొన్నారు.

## జిడికె-2 ఇంక్లైన్‌లో మల్టీ డిపార్ట్మెంట్ సమన్వయ సమావేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 19 : సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే ప్రధాన ధ్యేయంగా సంస్థ చైర్మన్, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిడికె-2 ఇంక్లైన్‌లో మల్టీ డిపార్ట్మెంట్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన సంస్థ-మన గని-మన బాధ్యత' అనే అంశంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సంస్థ సాధించిన బొగ్గు ఉత్పత్తి, కార్మిక సంక్షేమ కార్యక్రమాలు, గనుల్లో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలు, ప్రస్తుతం కంపెనీ ఎదుర్కొంటున్న మార్కెట్ సవాళ్లపై ఉ న్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ సభ్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి గనుల పనితీరు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, నెలవారీ ఉత్పత్తి లక్ష్యాలు, రవాణా ప్రణాళికలు తదితర అంశాలను ఉద్యోగులకు వివరించారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌జీ-1 ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి పెంపు లక్ష్యాలను సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారులు రాజన్న, బ్రహ్మాజీ రావు, స్టాట్యూటరీ మేనేజర్ రమేష్, సీఎంఓఏఐ సెక్రటరీ కోల మల్లేష్, గని యాక్టింగ్ మేనేజర్ జాన్సన్, పిట్ సెక్రటరీ పొన్నాల వెంకటయ్య, సేఫ్టీ ఆఫీసర్ దొంత వెంకటేశ్వర్లు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న నిల్వ కోసం అదనపు ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, మే 19 : జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న నిల్వ కోసం అదనపు ఏర్పాట్లు చేపట్టినట్లు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మంగళవారం రంగాపూర్‌లోని ధాన్యం గోదాంలను కలెక్టర్ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం నుంచి జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి రంగాపూర్ ఐజి గోదాంకు మొక్కజొన్న తరలింపు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ పనులను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### - క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు విస్తృతంగా పర్యటించి కొనుగోళ్లలో వేగం పెంచాలి
### - సిఓ, అగ్రికల్చర్ అధికారులపై కఠిన చర్యలుకై సంబంధిత అధికారులకు ఆదేశించిన
### - జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 19 : నరసింహులపేట, చిన్న గూడూరు మండలాలలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మంగళవారం ఆకస్మిక విస్తృత పర్యటనలు చేశారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో మక్కజొన్న, ధాన్యం, పెద్దనాగారం, వసురుతండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా తనిఖీ చేశారు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ రికార్డులను సరిగా మెయింటైన్ చేయడం లేదనీ, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గన్ని సంచుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిఓ, అగ్రికల్చర్ అధికారులపై కఠిన చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ రవాణా తదితర అంశాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించడం జరిగిందని, అయినా కొన్నిచోట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని అట్టి వారిని గుర్తించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం మ్యాచ్యుర్ వచ్చిన తర్వాతనే కూపన్ల ద్వారా కేటాయించాలని సూచించారు, రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకొని వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీలను అధికంగా అందుబాటులో ఉంచుకోవాలని లోడింగ్,అన్లోడింగ్ విషయంలో వేగంగా ముందుకు సాగాలని సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ నరసింహారావు, స్థానిక ఎంపీడీవో ఎమ్మార్వో తదితరులు ఉన్నారు.

## నాణ్యతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

### ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 19: సింగరేణి ఆర్జీ-2 ఏరియా పరిధిలోని ఓసిపి-3 ఉపరితల గనిలో మంగళవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్ ప్రత్యేక సమావేశంలో నాణ్యతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య పిలుపునిచ్చారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ హరిజన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన విజయాలను వివరించి, 2026-27 సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదక లక్ష్యాలపై ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రిస్తూ భారీ యంత్రాల పనిగంటలను గరిష్టంగా వినియోగించాలని సూచించారు. వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టేలా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రక్షణ సూత్రాలను పాటిస్తూ ప్రమాదరహితంగా ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కోరారు. ఆర్‌జీ-2 ఏరియా భవిష్యత్ కార్యాచరణతో పాటు కార్మిక సంక్షేమ కార్యక్రమాలపై కూడా వివరించారు. అనంతరం గని అభివృద్ధికి సంబంధించి ఉద్యోగుల నుంచి సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ మోట పలుకుల మహేందర్, ఎస్‌వోటు జీఎం మాలోత్ రాముడు, ఏజీఎం పర్సనల్ అరవింద్ రావు, ఏజీఎం ఐఈడీ చంద్రశేఖర్, ఏజీఎం ఈ అండ్ ఎం సుజన్ మెహ్రా, డీజీఎం పర్చేస్ రామచంద్ర, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజాజీ, ప్రాజెక్ట్ మేనేజర్ భరత్ కుమార్, అడిషనల్ మేనేజర్ (క్వాలిటీ) సుభాష్, గని సంక్షేమ అధికారులు సాయి కృష్ణ, అజీజ్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అదనపు ఎస్పీ

### ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పోలీసు శాఖకు మరింత బలం చేకూర్చాలని ఆకాంక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే 19 : వనపర్తి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్.,ని అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, ఐపీఎస్., మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకొని తిరిగి విధుల్లో చేరిన జిల్లా ఎస్పీకి ఈ సందర్భంగా రాజేష్ మీనా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో యువ ఐపీఎస్ అధికారిగా రాజేష్ మీనా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు చేపట్టడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల నిబద్ధత, విధుల పట్ల కర్తవ్యనిష్ఠ, సమర్థ నాయకత్వ లక్షణాలతో జిల్లా పోలీసు శాఖకు మరింత బలాన్ని చేకూరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి అక్క తల్లి చెల్లి బస్సులో సంతోషంగా ప్రయాణించాలి

### - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 19 : తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఆడబిడ్డ బస్సులో సంతోషంగా ప్రయాణించాలని ఉద్దేశంతోనే ఉచిత బస్సు ప్రయాణం ఆచరణలో పెట్టామని ప్రతి తల్లి అక్క చెల్లి సద్విని యోగం చేసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు మంగళవారం అంతర్గం మండలం ఎగ్లాస్పూర్ గ్రామం నుంచి గోదావరిఖని ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించి మాట్లాడారు గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం అందుబాటులో తేవాలని మీరంతా కోరిన మేరకే ఈరోజు ఆర్టీసీ బస్ సర్వీసును ప్రారంభించుకున్నామని ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు విద్యార్థులు ఉద్యోగులు రైతులు ప్రధానంగా మహిళలకు ఈ బస్ సర్వీస్ ఎంతగానో ఉ పయోగపడుతుందని అన్నారు ఆర్టీసీ బస్సును ప్రారంభించి ఎమ్మెల్యే మక్కాను సింగ్ రాజ్ ఠాకూర్ తానే స్వయంగా నడిపి అందరిని అబ్బుర పరిచారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జూపాక మమత శ్రీనివాస్ పంచాయితీ పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఖని లో ప్రజానాట్యమండలి 4వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 19 : తెలంగాణ ప్రజానాట్య మండలి 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్ లను మంగళవారం గోదా వరిఖని భాస్కర్ రావు భవన్‌లో ప్రజా సంఘాల నాయకులు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ఉ పాధ్యక్షులు కన్నం లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీలలో హైదరాబాద్ లో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాకారులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రజా సమస్యలపై కళారూపాల ద్వారా పోరాడుతున్న ప్రజానాట్యమండలి మహాసభల కు హార్థిక, ఆర్థిక సహకారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజానాట్య మండలి పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఎజ్జ రాజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, కళాకారులు జే. రాజు, రేణికుంట్ల రమాదేవి, నూకల మొండయ్య, జే. మోహన్, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, కవులు, రచయితలు, యూనియన్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినికి సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 19 : భీమారం మండలం గోవిందరం గ్రామా నికి చెందిన చెల్ల నాగమణి ఈనెల 24,వ తేదీన ఒడిస్సాలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైన సందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఉమారాణి దేవయ్య ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి ఉ మారాణి దేవయ్య, ఉప సర్పంచ్ బింగి స్వామి, ఏఏపీ చైర్మన్ ప్యాట లావణ్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీషా పాల్గొని నాగమణిని శాలువాతో సన్మానించి, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చుల నిమిత్తం సర్పంచ్ ఉమారాణి దేవయ్య 02 వేలు, ఏఏపీ చైర్మన్ ప్యాట లావణ్య నారాయణ 02 వేలు, ఉప సర్పంచ్ బింగి స్వామి 02 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ యువత క్రీడల్లో ముందుకు వెళ్లి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షిస్తూ, నాగమణి మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి కీర్తి తీసుకురావాలని గ్రామ ప్రజలందరూ హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.



## అంబేద్కర్ విగ్రహాన్ని ప్రధానం చేసేందుకు ముందుకొచ్చిన మబ్బు మహేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గుండాల, మే, 19 : ఆపదలో ఉన్నవారికి చేయూతను ఇవ్వడమే కాదు, ఆత్మగౌరవానికి సైతం మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ అండగా నిలుచుంటుంది. దానికి నిదర్శనమే యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసే అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ ముంద డుగు వేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం గుండాల గ్రామస్తులు ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్‌ని సంప్రదించారు. వారు కోరినట్లుగానే అంబేద్కర్ విగ్రహాన్ని ప్రధానం చేసేందుకు ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా గుండాల మండలం అంబే ద్కర్ కమిటీ సభ్యులు మహేష్ చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ యూత్ అధ్యక్షుడు అనేపర్తి ఆంజనేయులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అనేపర్తి యాదగిరి, అనేపర్తి రాజు, అనేపర్తి రాజమల్లు, అనేపర్తి రాములు, అనేపర్తి బిక్షం బత్తిని భరత్, యమగాని చందు, కందుకూరి సోమన్న, మల్లె పాక పరుశురాములు, అన్నపర్తి యాద గిరి, ఆంజనేయులు, వట్టిపల్లి సందీప్, బండారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెవుడు పేరుతో టోకరా!?

**- సోషల్ మీడియా ప్రకటన నమ్మి యువకుడికి టోకరా**

**- చెవుడు నయం చేస్తామంటూ రూ.76 వేల మోసం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 19:ఖమ్మం జిల్లా వీ.ఎం.బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ మోసం ఘటన వెలుగులోకి వచ్చింది. పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనను నమ్మి సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోయాడు. చెవుడు సమస్యకు శాశ్వత పరిష్కారం అందిస్తామని, ప్రత్యేక టాబ్లెట్లు వాడితే వినికిడి సమస్య పూర్తిగా నయం అవుతుందని సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహించిన గుర్తుతెలియని వ్యక్తులు యువకుడిని సంప్రదించారు.ప్రకటనను నమ్మిన బాధిత యువకుడు అందులో ఇచ్చిన ఫోన్ నంబర్లకు సంప్రదించగా, ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో కొంత మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లింపజేశారు. అనంతరం ప్రత్యేక మెడిసిన్ పంపిస్తామని, కోర్సు పూర్తి చేయాలంటే మరిన్ని చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికారు. ఇలా విడతల వారీగా వివిధ కారణాలు చూపిస్తూ డబ్బులు వసూలు చేస్తూ చివరకు రూ.76 వేల వరకు కాజేశారు.డబ్బులు చెల్లించిన తర్వాత కూడా మందులు అందకపోవడంతో బాధిత యువకుడికి అనుమానం వచ్చింది. పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు. దీంతో వెంటనే వీ.ఎం.బంజర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ఆరోగ్య సంబంధిత ప్రకటనలను అంధంగా నమ్మవద్దని, ముఖ్యంగా మందులు, చికిత్సల పేరుతో డబ్బులు అడిగే వారిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వైద్యులకు సంప్రదించకుండా ఆన్‌లైన్ ప్రకటనల ఆధారంగా మందులు కొనుగోలు చేయడం ప్రమాదకరమని తెలిపారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు లేదా ఆన్‌లైన్ మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# నేడు మెడికల్ షాపుల బంద్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 19:ఆల్ ఇండియా మెడికల్ షాప్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం మెడికల్ షాపుల బంద్ నిర్వహిం చనున్నారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లపై నియంత్రణ విధించాలని, నకిలీ మందుల అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో బంద్‌కు మద్దతుగా ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేపట్టారు. బంద్ నేపథ్యంలో పట్టణంలోని పలు మెడికల్ షాపులు మూతపడే అవకాశం ఉండటంతో ప్రజలు అవసరమైన మందులను ముందుగానే కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు.

# కల్లూరు మున్సిపాలిటీలో జనరల్ బాడీ సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 19:ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అధ్యక్షతన మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ పాల్గొని పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సభ్యులతో చర్చించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లు తమ అభిప్రాయాలను వెల్లడించగా, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి: డీడీ జ్యోతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 19:2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్-రెసిడెన్షియల్)లో 1వ తరగతి, 5వ తరగతి ప్రవేశాల కోసం జిల్లాలోని అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు జి. జ్యోతి కోరారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్/డే స్కాలర్స్)లో 128 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 131 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ చదివి ఉంటే అర్హులు కారని స్పష్టం చేశారు. 1వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు 2020 జూన్ 1 నుంచి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎస్సీ ఉపకులాల వారీగా సీట్ల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 20 నుంచి జూన్ 6 వరకు ఖమ్మం కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం (రూమ్ నెం. ఎ-34)లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ లేదా రేషన్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ లేదా మార్కుల మెమో జిరాక్స్ కాపీలతోకలిసి జూన్ 6సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని సూచిం చారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

# భద్రాద్రి జిల్లాలో వేగవంతంగా మక్కల కొనుగోలు

**- ఇల్లెందు, టేకులపల్లి కేంద్రాల నుంచి వేలాది బస్తాల తరలింపు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 19:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మక్కల కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఇల్లెందు, టేకులపల్లి కొనుగోలు కేంద్రాల ద్వారా భారీ మొత్తంలో మక్కజొన్నలను మార్కెట్ కమిటీలు, జిన్నింగ్ మిల్లులకు తరలించారు. ఇల్లెందు మార్కెట్ కమిటీలో 45 మంది హమాలీలు 75 ట్రిప్పుల ద్వారా సుమారు 7,500 మక్కజొన్న బస్తాలను లోడ్ చేశారు. అనంతరం 40 మంది హమాలీలు వాటిని కారేపల్లి జిన్నింగ్ మిల్లులో దింపి గోదాముల్లో భద్రపరిచారు. అలాగే టేకులపల్లి మండల కేంద్రం నుంచి 4 లారీలు, 34 ట్రాక్టర్ల ద్వారా 6,664 మక్కజొన్న బస్తాలను కారేపల్లి జిన్నింగ్ మిల్లుకు తరలించి నిల్వ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లా కలెక్టర్ అంకిత్ సూచనల మేరకు కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరిన్ని బస్తాలను కొనుగోలు చేసి గోదాములకు తరలించే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**- హౌసింగ్ సొసైటీకి 23 ఎకరాల భూమి అప్పగించాలని డిమాండ్ - ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 19:జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని, గత ప్రభుత్వం కేటాయించిన 23.2 ఎకరాల భూమిని వెంటనే హౌసింగ్ సొసైటీకి అప్పగించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు జర్నలిస్టులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుతోట ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి అవలంబించడం బాధాకరమన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జర్నలిస్టులకు కేటాయించిన భూమిని అందజేయడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. ఈ నెల 21న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ఆమోదం తెలపాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులకు విఘాతం కలిగించే విధంగా చీకటి జీవోలు జారీ చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు, మహిళ జర్నలిస్టులు సహా పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి

**– లక్షలాది భక్తులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యం – టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 19:జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి విద్యుత్ అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పుష్కరాల కోసం 330 ఎనిమిది మీటర్ల విద్యుత్ స్తంభాలు, 152 తొమ్మిది మీటర్ల స్తంభాలు, 8 పదకొండు మీటర్ల స్తంభాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 5 కి.మీ. మేర 11 కేవీ లైన్, 12 కి.మీ. ఎల్‌టీ లైన్ నిర్మాణం పూర్తి చేసి, 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరా పర్యవేక్షణ కోసం 16 కీలక ప్రాంతాల్లో 12 రోజుల పాటు రౌండ్ ది క్లాక్ మానిటరింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం 4 మంది డివిజనల్ ఇంజినీర్లు, 6 మంది ఏడీఈలు, 13 మంది ఏఈలు, 12 మంది సబ్ ఇంజినీర్లు, లైన్ సిబ్బంది సహా మొత్తం 150 మంది సిబ్బందిని విధుల్లో నియమించినట్లు పేర్కొన్నారు. దేవాలయం, టెంట్ సిటీ, వీఐపీ ఘాట్, మెయిన్ ఘాట్, హరిత హోటల్ తదితర ప్రాంతాలకు డబుల్ ఫీడింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక ఫీడర్‌లో అంతరాయం ఏర్పడినా మరో ఫీడర్ ద్వారా వెంటనే విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే అత్యవసర పరిస్థి తుల్లో స్పందించేందుకు కాళేశ్వరం, మహాదేవపూర్, కాటారం సబ్‌స్టేషన్ల వద్ద ప్రత్యేక బ్రేక్‌డౌన్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. "పుష్కరాలకు వచ్చే భక్తులకు విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయ సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యం" అని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు.

**భక్తులకు విద్యుత్ భద్రతా సూచనలు:**

పుష్కర ఘాట్లు, రహదారులు, పూజా మండపాల వద్ద హెచ్చరిక టేపులు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ తీగలకు దగ్గరగా వెళ్లకుండా భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించాలని సీఎండీ విజ్ఞప్తి చేశారు.

# కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య అన్నదానం

**– కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 19:భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 365 రోజుల నిత్య అన్నదాన కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం మరియు రేగొండ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్య అన్నదాన కార్యక్రమం ద్వారా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు దేవాలయ అభివృద్ధికి తోడ్పడటంతో పాటు భక్తుల రాకను కూడా పెంచుతాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించే దిశగా దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ ఎన్ఎస్ఆర్, భూపాలపల్లి మార్కెట్ చైర్మన్ గుతోజు కిష్టయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలో 'సింగరేణి కోల్ నీర్' ఆర్.ఓ ప్లాంట్ ప్రారంభం

**- విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం**

**- మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 19:సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ రెస్పాన్సిబిలిటీ (సీఈఆర్) నిధులతో మణుగూరు ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన 250 లీటర్ల సామర్థ్యంతో కూడిన 'సింగరేణి కోల్ నీర్' ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌ను మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ విస్తరణలో భాగంగా పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం రూ.5.5 లక్షల వ్యయంతో ఈ ఆర్.ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. మణుగూరు పరిసర ప్రాంతాల్లో సింగరేణి యాజమాన్యం మొత్తం 10 ఆర్.ఓ ప్లాంట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజీఎం బి. శ్రీనివాస చారి, ఏజీఎం (పర్సనల్) సలగల రమేశ్, పీఓ ఎంఎన్ఓసీ ఈ. శ్రీనివాస్, డీజీఎం (సివిల్) జి. శివప్రసాద్, డీజీఎం (సర్వే) ఎల్. దయాకర్, మణుగూరు ఓసీ మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి ఆర్. భాస్కర్ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, అడిషనల్ మేనేజర్లు నవీన్, కిషన్ రామ్, డిప్యూటీ ఎస్ఈలు శోభన్ బాబు, ప్రవీణ్, జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా పోలీసులకు వారంరోజుల యాన్యువల్ ఫైరింగ్ ప్రాక్టీస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 19:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ పరిధిలోని హేమచంద్రపురం పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి యాన్యువల్ ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ ప్రాక్టీస్‌లో పోలీస్ శాఖలో వినియోగించే వివిధ రకాల ఆయుధాలతో అధికారులు, సిబ్బంది శిక్షణ పొందనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,469 మంది పోలీసు అధికారులు, సిబ్బంది విడతల వారీగా ఈ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు పోలీసు సిబ్బందికి ఆయుధాల వినియోగంపై ప్రతి ఏడాది ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది అప్రమత్తత, నైపుణ్యాలను మరింత మెరుగుపరచడమే ఈ ఫైరింగ్ ప్రాక్టీస్ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# బ్యాంకుల ద్వారా విస్తృత స్థాయిలో రుణాల పంపిణీకి ప్రణాళిక

## - గ్రామీణ ప్రాంతాల్లో కొత్త బ్యాంక్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలి

## - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 19:జిల్లాలో రైతులు, స్వయం ఉపాధి రంగాలు, విద్యా మరియు వైద్య రంగాలకు విస్తృత స్థాయిలో రుణాలు అందించేందుకు బ్యాంకులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు రావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం మరియు 2026-27 వార్షిక రుణ ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ కంట్రోలర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, రైతు భీమా, ఉపాధి హామీ వంటి పథకాల నిధులను బ్యాంకులు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి యూనిట్లలో భాగంగా పాడి పరిశ్రమకు స్థానికంగా పశువుల కొనుగోలు జరిగేలా చూడాలని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న పశువులు స్థానిక వాతావరణాన్ని తట్టుకోలేక పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు మరణిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. పంట రుణాలు బకాయి ఉన్న రైతుల జాబితాను అందిస్తే అవగాహన కల్పించి రికవరీకి సహకరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, బ్యాంకులు కూడా ఈ రంగాలకు ప్రాధాన్యతతో రుణాలు మంజూరు చేయాలని కోరారు. అజాంనగర్, చల్లగరిగె, కొడవటంచ, ఘనపూర్ ప్రాంతాల్లో కొత్త బ్యాంక్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఆర్బీఐ ఎల్‌డీఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం టీసీ రవి, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డీఆర్‌డీఓ బాలకృష్ణ, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, డీటీడబ్ల్యూఓ నాగసాగర్, బ్యాంక్ కంట్రోలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

## - ముందస్తు ప్రణాళిక లేకపోవడమే సమస్యలకు మూలం - మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 19:రైతులు పండించిన ధాన్యం అమ్ముకోలేకపోవడంలో రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లోపమే ప్రధాన కారణమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడారు. రైతులు పండించిన పంటకు గన్ని బ్యాగులు సరఫరా చేయడంలో మొదలుకొని కొనుగోలు ప్రక్రియ వరకు అన్ని దశల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి కనీస అవగాహన కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గోదాంల ఏర్పాటు వంటి అంశాలపై ముందస్తు సమీక్ష లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలకు సమయం ఉన్నా, రైతుల ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేయడానికి సమయం లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో రైతులు గన్ని బ్యాగులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి, 51.5 కిలోల కాంట వేయడం, లోడింగ్--అన్‌లోడింగ్ పనులు స్వయంగా చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మళ్లీ దళారీ వ్యవస్థ పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు కాంగ్రెస్ నాయకుల ప్రభావంలో నడుస్తున్నాయని ఆయన ఆరోపించారు. రైతుల పంటల కొనుగోలు, ఉత్పత్తి అంచనా, గోదాంల ఏర్పాటుపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. అధి కారంలోకి వస్తే రైతు రాజ్యం తీసుకొస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శిం చారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయానికి ఊతమిచ్చే విధంగా లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు పెరిగిందని గుర్తు చేశారు. యూరియా యాప్ సక్రమంగా పనిచేయడం లేదని, వెంటనే దాన్ని సరిచేసి రైతులకు ఎరువులు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీజిల్, ఎరువుల ధరల పెరుగుదలతో రైతులపై అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన విజ్ఞప్తి చేశారు.




# పకడ్బందీగా జనగణన సర్వే నిర్వహించాలి

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 19:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పలు కార్యక్రమాలను ఆకస్మికంగా పరిశీలించారు. మల్లెలమడుగు గ్రామంలో సెన్సస్-2027 జనగణన ఇంటింటి సర్వే, మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రం, సీతారాంపురంలోని శివసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ కలెక్టర్ వెంట పాల్గొన్నారు. మల్లెలమడుగు గ్రామంలో ఎన్యూమరేటర్లతో మాట్లాడిన కలెక్టర్ అంకిత్, జనగణనలో 34 ప్రశ్నలు ఉంటాయని, ఒక్కో కుటుంబ వివరాలు ఐదు నిమిషాల్లో నమోదు చేయవచ్చని తెలిపారు. తెలంగాణ ఏర్పాటయ్యాక జరుగుతున్న తొలి జనగణన ఇదేనని, పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్యూమరేటర్ల ఐడీ కార్డులపై ఉన్న క్యూ ఆర్ కోడ్ ద్వారా వారి వివరాలు తెలుసుకోవచ్చని, ప్రజలు ఖచ్చితమైన సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఇంటిని కవర్ చేస్తూ ఎలాంటి లోపాలు లేకుండా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ధాన్యం నిల్వలు, కొనుగోలు, రవాణా, రైతులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ప్రస్తుతం కేంద్రంలో 5,550 ధాన్యం బ్యాగులు నిల్వలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి, రికార్డు నమోదు చేసి, మిల్లులకు వేగంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం నాణ్యత, తేమ శాతం, నిల్వ విధానాన్ని పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన హమాలీలతో మాట్లాడిన కలెక్టర్, వారి వసతి, తాగునీరు, ఆహార సదుపాయాలపై ఆరా తీశారు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమ గోడపత్రికను కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక సూచనలు గ్రామస్థాయిలో అందేలా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. తదుపరి సీతారాంపురంలోని శివసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, మిల్లులో సుమారు 6,000 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో ఉన్నట్లు తెలుసుకున్నారు. నిల్వలు పేరుకుపోకుండా ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలని, మిల్లింగ్ ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి సంధ్యారెడ్డి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, తాసిల్దార్ సూర్యప్రకాష్, వ్యవసాయ శాఖ ఏడీ తాతారావు, ఏఎస్ఓ రాజ్యలక్ష్మి, ఆర్ఐ లీలావతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో అక్రమాలపై కఠిన చర్యలు

## - రైతులను మోసం చేస్తే మిల్లులు సీజ్ చేస్తాం

## - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 19:ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే రైస్ మిల్లులను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌లతో కలిసి గణపురం మండలంలోని జానకిరామ్ రైస్ మిల్, చిట్యాల మండలం కైలాపూర్‌లోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లులకు తరలింపు జరుగుతున్నప్పటికీ రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తైన వెంటనే ట్రక్ షీట్‌లు ఇవ్వడం తప్పనిసరిగా చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ మోసం చేయరాదని, అటువంటి చర్యలు జిల్లాకు చెడ్డ పేరు తెస్తాయని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఉపేక్ష ఉండదని, అవసరమైతే మిల్లులను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగితే పూర్తి సహకారం ఉంటుందని, కానీ అవకతవకలను సహించబోమని తెలిపారు. జిల్లాలో గత ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న అక్రమ పద్ధతులకు ఇకపై అవకాశం ఇవ్వబోమని, వెంటనే సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ట్రక్ షీట్‌ల జారీని తప్పనిసరి చేయాలని, జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి తనిఖీల్లో ఇప్పటికే ట్రక్ షీట్‌లు వెంటనే ఇవ్వాలని ఆదేశించినప్పటికీ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

## - ప్రతి ఇంటికి ఏసీఎం స్ప్రే, అవగాహన కార్యక్రమాలు

## - ప్రతాపగిరి సర్పంచ్ వెంకటేశ్వరరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కాటారం, మే 19:మండలంలోని ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధిలోని బొప్పారం (మర్రిపల్లి) గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ పూర వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో గ్రామంలోని ప్రతి ఇంటికి ఏసీఎం స్ప్రే నిర్వహించారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మౌనిక ఆదేశాల మేరకు ఏఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితమే గ్రామంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహించామని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బందితో ప్రతిరోజూ శానిటేషన్, మురికి కాలువల శుభ్రత పనులు చేపడుతున్నామని చెప్పారు. గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని అవసరమైన ఖర్చుతో మంచినీటి సరఫరా అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, ఆశా వర్కర్ కండెల స్వరూప, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదాముల వద్ద రైతుల ఆందోళన

## - హమాలీల కొరతతో రోజుల తరబడి ఎదురుచూపులు

## - పంట దిగుమతులు వేగవంతం చేయాలని రైతుల డిమాండ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 19:ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూర్ మండల పరిధి కల్లూరుగూడెం ఏఎంసీ గోదాముల వద్ద మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న దిగుమతుల కోసం రోజుల తరబడి గోదాముల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీల కొరత కారణంగా పంట దిగుమతుల ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో గోదాముల వద్దే ఉండిపోవాల్సి వస్తోందని, దీంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా అధికారుల నిర్లక్ష్య వైఖరిపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా హమాలీలను ఏర్పాటు చేసి, పంట దిగుమతులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# సింగరేణి అభివృద్ధికి ఉద్యోగుల సమిష్టి కృషి అవసరం

## - క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలి : జీఎం రాజేశ్వర్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


జయశంకర్-భూపాలపల్లి, మే 19:సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి సాధించాలంటే ఉద్యోగుల సమిష్టి కృషి, క్రమశిక్షణ, అంకితభావం అత్యంత అవసరమని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సంస్థ లక్ష్యాలను తమ లక్ష్యాలుగా భావించి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్ భూగర్భ గనిలో సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి సంస్థ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమావేశాల కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. దేశ పారిశ్రామికాభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సంస్థ రూపొందిస్తున్న ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని సూచించారు. నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని, వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యమైన ఉత్పత్తి అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సంస్థను జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్యం, విద్య, నివాసం, భద్రత రంగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలను ఉద్యోగులు సద్వినియోగం చేసుకుంటూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మహిళా ఉద్యోగులను ఉద్దేశించి జీఎం మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైందని, వారు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. మహిళా ఉద్యోగులు ధైర్యంగా ముందుకు సాగుతూ ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూగర్భ గనుల్లో పనిచేయడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎస్.కవీంద్ర, ఏజీఎం (ఐఈడీ) జ్యోతి, ఇంచార్జ్ ఏరియా ఇంజనీర్ రాజారావు, డీజీఎం (ఎఫ్ అండ్ ఏ) పి.రాజేశ్వర్, డీజీఎం (క్వాలిటీ) కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, 5 ఇంక్లైన్ మేనేజర్ మాచర్ల రమేష్, సంక్షేమ అధికారి సందీప్, ఏఐటీయూసీ నాయకులు రవి, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి.మధుకర్ రెడ్డి, సీఎంఓఏఐ అధ్యక్షుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.



# కీర్తి డైట్ మ్యాజిక్..

సౌత్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ మహానటి సినిమాతో జాతీయ అవార్డు గెలుచుకుంది. అలాంటి ఈమె తన ఫిట్‌నెస్ మరియు బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్‌పై సంచలన విషయాలను పంచుకున్నారు. గత కొంతకాలంగా ఆమె బరువు తగ్గడంపై సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు, సర్జరీలంటూ ట్రోల్స్ వస్తున్న నేపథ్యంలో, వాటన్నిటికీ కీర్తి సురేష్ గట్టిగా సమాధానమిచ్చారు. తాను 9 నెలల్లో ఏకంగా 10 కేజీల బరువు ఎలా తగ్గిందో, ఆ డైట్ మ్యాజిక్ సీక్రెట్ ఏంటో ఆమె సోషల్ మీడియా పోస్ట్ లో తెలిపింది.. కీర్తి సురేష్ కెరీర్‌ను మలుపు తిప్పిన చిత్రం మహానటి. ఆ సినిమా తర్వాత దొరికిన ఒక చిన్న బ్రేక్‌లో ఆమె తన ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై గట్టిగా ఫోకస్ పెట్టాలని నిర్ణయించుకున్నారు. అప్పటివరకు వ్యాయామం అంటే పెద్దగా ఇష్టం లేని కీర్తి.. ఆ సమయంలో కఠినమైన వర్కౌట్ లు, డైట్ ప్లాన్స్‌తో సరికొత్త ప్రయోగాలు చేయడం మొదలుపెట్టారు. అలా తన ఫిట్‌నెస్ జర్నీలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. తాను బరువు తగ్గడం వెనుక ఎటువంటి సర్జరీలు లేవని, అంతా సహజంగానే జరిగిందని కీర్తి క్లారిటీ ఇచ్చారు. ఈ ట్రాన్స్‌ఫార్మేషన్ కోసం ఆమె హై-ప్రోటీన్, లో-కార్బ్ డైట్‌ను పక్కాగా ఫాలో అయ్యారు. అంటే కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారాన్ని తగ్గించి, ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకున్నారు. ఇక దీనితో పాటు హై-ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ మరియు కార్డియో వర్కౌట్ లు చేస్తూ కేవలం 9 నెలల్లోనే 10 కేజీల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచారు. కష్టపడి బరువు తగ్గితే జనాలు అభినందించాల్సింది పోయి, రకరకాల పుకార్లతో తనను చాలా బాధించారని కీర్తి ఆవేదన వ్యక్తం చేశారు. "నేను కొంచెం బొద్దుగా ఉన్నప్పుడు లావుగా ఉన్నానన్నారు.. సన్నబడిన తర్వాతేమో బలహీనంగా ఉన్నానంటూ, సర్జరీలు చేయించుకుందని ప్రచారం చేశారు. ఇక నా ముఖాన్ని, శరీరాన్ని నేను ఎప్పుడూ ఒకేలా నాచురల్ గా ఉంచుకోవడానికే ఇష్టపడతాను. జనాలు ఒకరు సన్నగా ఉంటే లావుగా అవ్వమంటారు, లావుగా ఉంటే సన్నబడమంటారు" అంటూ బాడీ షేమింగ్ చేసేవారిపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఒకప్పుడు వర్కౌట్ లను అస్సలు ఇష్టపడని కీర్తి సురేష్, ఇప్పుడు వాటిని తన లైఫ్‌లో ఒక ముఖ్య భాగం చేసుకున్నారు. ప్రస్తుతం తాను స్ట్రెంత్ ట్రైనింగ్ మరియు యోగా రెండింటినీ సమానంగా బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఇక మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి ఈ లైఫ్‌స్టైల్ ఎంతో హెల్ప్ అవుతుందని, ఇప్పుడు వర్కవుట్లను అస్సలు వదిలిపెట్టలేకపోతున్నానని ఆమె సంతోషంగా పంచుకున్నారు. సరికొత్త ఫిట్‌నెస్ మంత్రంతో, ఆరోగ్యకరమైన పద్ధతిలో 10 కేజీలు తగ్గి కీర్తి సురేష్ నిజమైన డైట్ మ్యాజిక్ ఏంటో చూపించారు. పుకార్లను నమ్మకుండా, పక్కా ప్లానింగ్, క్రమశిక్షణ ఉంటే ఎవరైనా అనుకున్న ఫిట్‌నెస్ గోల్స్ సాధించవచ్చని ఆమె నిరూపించారు.

# భాగ్యశ్రీకి.. తమిళంలో ఇంకోటి



అందం, అభినయం రెంటితోనూ ఆకట్టుకున్నప్పటికీ.. కొందరు హీరోయిన్లకు అదృష్టం కలిసి రాదు. వరుసగా అవకాశాలు వస్తున్నా.. సినిమాలు హిట్ కావు. ముంబయి భామ భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి ఇదే. ఇప్పటికే ఆమె తెలుగు, తమిళ భాషల్లో నాలుగు సినిమాలు చేసింది. అందులో తెలుగులో నటించిన సినిమాలు.. మిస్టర్ బచ్చన్, కింగ్డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా. తమిళంలో 'కాంత' అనే సినిమాలో నటించింది. కానీ వీటిలో ఏదీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. మిస్టర్ బచ్చన్ మినహాయిస్తే మిగతా మూడూ పర్వాలేదనిపించే సినిమాలే. కానీ ఆడలేదు. అందం, అభినయం రెంటితోనూ ఆకట్టుకున్నప్పటికీ.. కొందరు హీరోయిన్లకు అదృష్టం కలిసి రాదు. వరుసగా అవకాశాలు వస్తున్నా.. సినిమాలు హిట్ కావు. ముంబయి భామ భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి ఇదే. ఇప్పటికే ఆమె తెలుగు, తమిళ భాషల్లో నాలుగు సినిమాలు చేసింది. అందులో తెలుగులో నటించిన సినిమాలు.. మిస్టర్ బచ్చన్, కింగ్డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా. తమిళంలో 'కాంత' అనే సినిమాలో నటించింది. కానీ వీటిలో ఏదీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. మిస్టర్ బచ్చన్ మినహాయిస్తే మిగతా మూడూ పర్వాలేదనిపించే సినిమాలే. కానీ ఆడలేదు. 'తాయ్ కిళవి' తరహాలోనే తన రెండో చిత్రాన్ని కూడా రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తీయబోతున్నాడు శివకుమార్. ఇలాంటి చిత్రాల్లో కథానాయికను లంగావోణీలు, చీరల్లో కొంచెం మాస్‌గా చూపిస్తుంటారు. మరి అలాంటి పాత్రలో భాగ్యశ్రీ ఎలా ఒదిగిపోతుందో చూడాలి. 'కాంత' సినిమా ఫ్లాప్ అయినప్పటికీ.. భాగ్యశ్రీ కెరీర్లో బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చింది. ఆమె జస్ట్ అందగత్తె కాదని, మంచి పెర్ఫామర్ అని ఈ సినిమాతో రుజువైంది.

# మళ్లీ ఇండస్ట్రీలో కలకలం.

మూవీ ఇండ్రస్ట్రీ లో మహిళలపై, మైనర్లపై జరిగే వేధింపుల గురించి ప్రముఖ సింగర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద ఎప్పుడూ ఓపెన్‌గా మాట్లాడుతుంటారు. తాజాగా ఆమె సోషల్ మీడియా వేదికగా పాత తరం నటులపై చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. సినిమాల పేరుతో గతంలో కొందరు సీనియర్ నటులు మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఆమె చేసిన పోస్ట్‌లు ఇప్పుడు నెట్టింట వైరల్ అయ్యింది. ఆ వివరాలు చూద్దాం. గతంలో వచ్చిన 'దో షికారి' అనే హిందీ చిత్రంలో 15 ఏళ్ల వయసున్న నటి రేఖతో, 32 ఏళ్ల నటుడు బిస్వజిత్ ముద్దు సీన్ చేశారంటూ ఒక నెటిజన్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇక ఆ సమయంలో రేఖ ఇంకా మైనర్ కావడంతో, ఈ సీన్ వెనుక ఉన్న పరిస్థితులపై నెటిజన్లు రకరకాలుగా చర్చించుకోవడం మొదలుపెట్టారు.

రియాక్ట్ అయిన చిన్మయి: ఈ ట్వీట్‌పై సింగర్ చిన్మయి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాల పేరుతో, నటన పేరుతో కొందరు సీనియర్ నటులు మైనర్లపై ఇలాంటి లైంగిక వేధింపులకు పాల్పడటం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఇక ఈ రకమైన ఘటనలు చూస్తుంటే చాలా బాధగా, అసహ్యంగా అనిపిస్తోందని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ వివాదంలోకి చిన్మయి బాలీవుడ్ దిగ్గజ నటులు వినోద్ ఖన్నా, ఫెరోజ్ ఖాన్‌ల పేర్లను కూడా లాగారు. గతంలో వారిద్దరి గురించి వచ్చిన కొన్ని పాత ఆర్టికల్స్, కథనాలను తాను చదివానని.. అవి చదివినప్పుడు తాను తీవ్ర ఆశ్చర్యంకు గురయ్యానని చెప్పారు. ఇక ఇండస్ట్రీలో ఇలాంటి పద్ధతులు దారుణమంటూ ఆమె మండిపడ్డారు. నెటిజన్ల కౌంటర్లు: అయితే చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. కొందరు ఆమెకు సపోర్ట్ చేస్తుండగా.. మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమెపై మండిపడుతున్నారు. ప్రస్తుతం లేని సీనియర్ నటుల గురించి, పూర్తి నిజాలు తెలియకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదని, విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని ఆమెకు సలహా ఇస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో అప్పట్లో 'మీటూ' మూమెంట్‌తో పెద్ద సంచలనం సృష్టించిన చిన్మయి.. ఇప్పుడు మళ్లీ పాత తరం నటుల విషయాలను తెరపైకి తేవడం చర్చనీయాంశమైంది. మరి ఈ సరికొత్త వివాదం ఇంకెంత దూరం వెళ్తుందో, దీనిపై పరిశ్రమకు చెందిన మిగతా వారు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



## సినిమా న్యూస్




# రామ్ చరణ్‌లో నమ్మకాన్ని నింపిన సల్మాన్-అమీర్ ఖాన్!

రామ్ చరణ్ నేడు గ్లోబల్ స్టార్. అతడిపై వందల కోట్ల వ్యాపారం జరుగుతుంది. తండ్రిని మించిన తనయుడిగా ఎదుగుతున్నాడు. కథలపరంగా చరణ్ లో ఎంతో మెచ్యూర్టీ వచ్చిందిప్పుడు. ఒకప్పుడు కమర్శియల్ కథలకే ఓటేసిన చరణ్ ఇప్పుడు వైవిధ్యమైన కాన్సెప్ట్ లు తప్ప రోటీన్ కథలకు ఒకే చెప్పడం లేదు. ప్రస్తుతం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో -పెద్ది- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. -రంగస్థలం- తర్వాత మరో మట్టి వాసన కథలో నటిస్తున్నాడని ఫస్టు లుక్ పోస్టర్ తోనే తేలిపోయింది. అటుపై ఈ కథకు క్రీడా నేపథ్యం కూడా ఉందని వెలుగులోకి వచ్చింది.

తాజాగా రిలీజ్ అయిన ట్రైలర్ తో క్రీడతో పాటు అంతకు మించి బలమైన ఎమోషన్ కూడా కథలో ఉందని.. స్టోరీలో చాలా పార్శ్వాలున్నాయని అర్ధమవుతుంది. పాత్ర కోసం చరణ్ మేకోవర్ అంతకంతకు హైప్ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ మీట్ లో బాలీవుడ్ అగ్ర హీరోలైన సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్‌లు తనపై చూపిన ప్రభావం గురించి చరణ్ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. -పెద్ది- సినిమా కథాంశం గ్రామీణ నేపథ్యం కలిగిన స్పోర్ట్స్ డ్రామా అని ఇలాంటి విలక్షణమైన పాత్రను అంగీకరించడానికి బాలీవుడ్ సూపర్‌స్టార్లు సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ నటించిన చిత్రాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని వెల్లడించారు.

అమీర్ ఖాన్ నటించిన -దంగల్-, సల్మాన్ ఖాన్ చిత్రం -సుల్తాన్- బాక్సాఫీస్ వద్ద సాధించిన భారీ విజయాలు, ఆ సినిమాల్లోని కంటెంట్ నటుడిగా తనలో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాయని చరణ్ కొనియాడారు. -దంగల్-, -సుల్తాన్- వంటి చిత్రాలు కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా ఒక క్రీడ చుట్టూ ఉండే భావోద్వేగాలను, కష్టాలను అద్భుతంగా ఆవిష్కరించాయి. ఉత్తరాది ప్రేక్షకులు ఆ చిత్రాలను అద్భుతంగా ఆదరించడం వల్లే తాను చేస్తున్న -పెద్ది- వంటి వైవిధ్యమైన సినిమాకు పక్కా మార్గం సుగమం అయిందని చరణ్ అభిప్రాయపడ్డారు.

రూటెడ్ -ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాలకు ఇండియా అంతటా అద్భుతమైన మార్కెట్ ఉందని ఈ చిత్రాల విజయాలు నిరూపించాయని చరణ్ పేర్కొన్నారు. ఉత్తర-దక్షిణాది చిత్ర పరిశ్రమల మధ్య బంధం మరింత బలపడుతున్న తరుణంలో టాలీవుడ్ స్టార్ హీరో బాలీవుడ్ సినిమాల సక్సెస్ ఫార్ములాను - అక్కడి స్టార్ల ప్రదర్శనను ఓపెన్‌గా ప్రశంసించడం ఇండస్ట్రీలో హెల్తీ వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. మల్ల యోధులుగా సుల్తాన్ చిత్రంలో సల్మాన్ ఖాన్..దంగల్ చిత్రంలో అమీర్ ఖాన్ అసాధారణ నటన గురించి తెలిసిందే. ఆ చిత్రాల కోసం స్టార్ హీరోలిద్దరు ఎంతో శ్రమించారు. కుస్తీ పోటీ కోసం ఇద్దరు స్టార్లు ప్రత్యకంగా సన్నదమై బరిలోకి దిగారు. అందుకే పాత్రల మధ్య అంత సహజత్వం ఒట్టిపడింది. మరి -దంగల్-, -సుల్తాన్- చిత్రాలు ఇచ్చిన ఇన్‌స్పిరేషన్‌తో తెరకెక్కుతున్న -పెద్ది- బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించబోతోందో చూడాలి.



# ఆరోగ్యం

## ఎండాకాలం ఫ్రిడ్జ్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పెట్టేవారికి షాకింగ్ న్యూస్ - వారికైతే మరణం గ్యారెంటీ!



ఈ రోజుల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వాడకం విపరీతంగా పెరిగింది. సీసా బాటిళ్లతో కూడిన వాటర్ బాటిళ్లు మార్కెట్లో చాలా రకాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, ఎక్కువమందీ ఇంట్లో ఫ్రిజ్‌లో ప్లాస్టిక్ బాటిళ్లనే ఎక్కువగా వాడతారు. దీనికి కారణం, సీసా బాటిళ్లను తీసుకోవడం చాలా ఖరీదైనది. అలాగే వాటిని తీసుకున్న తరువాత కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే అవి పగిలిపోతాయి. కానీ ప్లాస్టిక్ బాటిళ్ల ధర చౌకగా ఉంటుంది. కింద పడ్డ కూడా అంత సులభంగా పగలవు. అందుకే ఎక్కువ మంది వీటిని వినియోగించడానికి ట్రై చేస్తుంటారు. కానీ ఈ ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం కొన్ని ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అవి మన ఆరోగ్యంపై ప్రతికూలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం రండి. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం వల్ల వచ్చే ప్రమాదాలు ప్లాస్టిక్ బాటిళ్లను ప్రస్తుత కాలంలో ఎన్నో రసాయనాలు వాడి తయారు చేస్తున్నారు. వాటి మనం ప్రతిరోజూ వాడే విధానం, వాటిలోని రసాయనాలు కరిగి మన శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అలాగే అందులోని బ్యాక్టీరియా, ప్రమాదకరమైన ప్లాస్టిక్ కణాలు అంతా మన శరీరంలోకి చేరి.. ప్రమాదకరమైన క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే అవకాశాన్ని సృష్టిస్తాయి. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లను వాడడం అనేది అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ. ప్లాస్టిక్ బాటిళ్లను వాడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: బాటిళ్లను తరచూ మార్చడం: ఫ్రిజ్‌లోని ప్లాస్టిక్ బాటిళ్లను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. ఒకే బాటిల్‌ను చాలా కాలం వాడడం వల్ల, అది మురికితో నిండిపోతుంది. అలాగే అందులో బక్టీరియా పెరుగుతుంది. అలాగే, ప్లాస్టిక్ బాటిళ్లలోని రసాయనాలు నీటిలోకి లీక్ అవటం వల్ల.. అందులోని ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు శరీరంలోకి ప్రవేశించవచ్చు. ఎన్ని రోజుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు మార్చాలంటే సాధారణంగా, ప్లాస్టిక్ బాటిళ్లను 6 నెలలలోపు మార్చడం మంచిది. కొన్ని అధిక నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు 12 నెలల వరకు వాడొచ్చు. అయితే, బాటిల్ పగిలిపోయినట్లయితే, దుర్వాసన వచ్చిందని గమనిస్తే వెంటనే మార్చాలి.

గ్లాస్ మరియు స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు

గ్లాస్ వాటర్ బాటిళ్లు, సాధారణంగా, 2-3 సంవత్సరాల పాటు ఉపయోగించవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు కూడా 2 సంవత్సరాల తర్వాత కచ్చితంగా మార్చాల్సిన అవసరమైతే ఉంటుంది. ఇవి స్థిరమైన పదార్థాలతో తయారు కావడంతో పాటు తొందరగా పాడవకపోవడంతో వాటిని ఎక్కువగా కాలం వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రతిరోజూ శుభ్రం చేయడం బాటిళ్లను సరైన పద్ధతిలో శుభ్రం చేయడం చాలా ముఖ్యం. ప్రతి రోజు వాటిని వేడి నీటి మరియు సబ్బుతో శుభ్రం చేయడం వల్ల అందులో బక్టీరియా పెరుగుదలను నివారించవచ్చు. శుభ్రతను పాటించడం వలన బాటిల్ శుభ్రంగా ఉండడంతో పాటు అందులో పోసే నీరు కూడా పరిశుభ్రంగా ఉంటుంది. ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయాలు: గ్లాస్ బాటిళ్లు: గ్లాస్ బాటిళ్లను ఉపయోగించడం చాలా మంచి ప్రత్యామ్నాయం. ఇవి లీకేజి సమస్య లేకుండా, ఆరోగ్యానికి ప్రమాదకరం కాని పదార్థాలను విడుదల చేయవు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు: ఇవి కూడా మంచి ఆప్షన్. ఇవి దృఢంగా ఉండి, ఎక్కువ కాలం వాడటానికి సరైనవి. ఇవి పగిలిపోవడం లేదా లీక్ అవడం చాలా అరుదు. తగిన జాగ్రత్తలు ప్లాస్టిక్ బాటిళ్లలో నీటి నిల్వ చేయడానికి, మంచి నాణ్యత కలిగిన బాటిళ్లను మాత్రమే తీసుకోవడం మంచిది. బాటిళ్లను మూసివేసి ఉంచుకోవడం వల్ల బయట జంతువులు, ధూళి, కురుపులు వాటిలో చేరకుండా ఉంటాయి. సీసా లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లలోనే నీటి నిల్వ చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

## మండే ఎండలో ఈ షర్బత్ తాగితే చిటికెలో బాడీ కూల్ అయిపోతుంది

### రంజాన్ స్పెషల్ కూడా.. ఎలా చేసుకోవాలంటే

రంజాన్ మాసం చివరి దశకు వచ్చేసింది. మరికొన్ని రోజుల్లో ఈ రంజాన్ మాసం ముగిసిపోతుంది. మార్చి 31వ తేదీన రంజాన్ పండగ తరువాత ఈ మాసం గుడ్ బాయ్ చెప్పనుంది. అయితే ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. బయటికి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఎండ వేడిమి తాళలేక రకరకాల పానీయాలు తయారు చేసుకోవడం, బయట తాగడం వంటివి చేస్తున్నారు. అయితే ఇప్పటికీ రంజాన్ పండగ కొనసాగుతున్న నేపథ్యంలో సమ్మర్? ప్రత్యేకమైన చల్లని, రిఫ్రెషింగ్ షర్బత్ తాగితే ఆ రుచి, ఆ చల్లదనం అద్భుతంగా ఉంటుంది. అలాగే సమ్మర్‌లో తాగడానికి ఇదే బెస్ట్ ఆప్షన్ అంట కూడా. ఇంట్లో ఉండే సాధారణ పదార్థాలతోనే మీ ఇంటి సభ్యులు సమ్మర్ మజా అనుభవించవచ్చు. అయితే, దీనిని తయారుచేయడానికి అవసరమైన పదార్థాలు మరియు తయారీ విధానం ఈ స్టోరీలో తెలుసుకుందాం.

షర్బత్ తయారీకి కావలసిన పదార్థాలు: పంచదార - 1 కప్పు నీళ్లు - పావు కప్పు పాలు - 4 కప్పులు కస్టర్డ్ పొడి - 1 టేబుల్ స్పూన్ పాలు (కస్టర్డ్ కోసం) - 2 టేబుల్ స్పూన్లు కుంకుమ పువ్వు - అర టీస్పూన్ యాలకుల పొడి - 1 టీస్పూన్ చియా సీడ్స్ - 1 టేబుల్ స్పూన్ బాదం, పిస్తా పలుకులు - 2 టేబుల్ స్పూన్లు.

రంజాన్ షర్బత్ తయారీ విధానం: రంజాన్ షర్బత్ తయారు చేసుకోవడానికి మొదటగా స్టవ్‌పై పాన్ పెట్టి అందులో పంచదారను వేసి, సిమ్ మంట మీద కరిగేలా బాగా కలపాలి. పంచదార కరిగి అందులో పొంగుల ద్వారా రంగు మారినప్పుడు, దానిలో పావు కప్పు నీళ్లు జోడించాలి. నీళ్లు వేసిన తర్వాత మిశ్రమాన్ని బాగా కలుపుతూ ఉంచాలి. అలానే కలుపుతూ బాగా ఉడికించుకోవాలి.

ఇప్పుడు మంటను సిమ్‌లో ఉంచి, పంచదార కరిగిపోయే వరకు..



ఒక గిన్నెలో కుంకుమ పువ్వును నానబెట్టుకోవాలి. ఆ తరువాత, పాలు కూడా ఈ మిశ్రమంలో జోడించి బాగా కలపాలి. పాలు మరియు పంచదార చక్కగా కలిసిపోయేలా 4-5 నిమిషాలు ఉడికించాలి. ఈ సమయంలో, ఒక చిన్న గిన్నెలో కస్టర్డ్ పౌడర్ తీసుకుని, 2 టేబుల్ స్పూన్ల పాలు వేసి కరిగించాలి. ఈ కస్టర్డ్ మిశ్రమాన్ని స్టవ్‌పై ఉడికే మిశ్రమంలో జోడించి, గట్టిగా కలుపుతుండాలి. ఈ మిశ్రమం తయారు చేస్తున్న సమయంలో ఎటువంటి గడ్డలు రాకుండా ఎప్పటికప్పుడు కలుపుతూ ఉండాలి. ఇప్పుడు కుంకుమ పువ్వును మరియు యాలకుల పొడిని కూడా ఈ మిశ్రమంలో జోడించి, ఇంకో 5 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తరువాత ఈ మిశ్రమాన్ని మరొక గిన్నెలో తీసుకొని, రూమ్ టెంపరేచర్‌కి రానివ్వాలి. ఆ తరువాత 2 గంటలు ఫ్రిడ్జ్‌లో వుంచాలి. ఫ్రిడ్జ్ నుండి తీసిన తర్వాత, చియా సీడ్స్ లేదా బేసిల్ సీడ్స్‌ని నీటిలో నానబెట్టుకుని, షర్బత్‌లో జోడించి బాగా కలపాలి. చివరగా, బాదం మరియు పిస్తా పలుకులతో గార్నిష్ చేసి, ఐస్ క్యూబ్స్ వేసి చల్లగా సర్వ్ చేసుకోవచ్చు. ఈ చల్లని, టేస్టీ దూద్ షర్బత్‌ను రంజాన్ పండుగ సమయంలో కానీ, సమ్మర్ లోనూ చాలా సులభంగా, తక్కువ సమయంలోనే రెడీ చేసుకొని ఆస్వాదించొచ్చు.

## మన పూర్వీకులు తిన్నది ఇదే..



మనం ఇప్పటికీ మన పూర్వీకుల ఆరోగ్యం గురించి గొప్పగా చెప్పుకుంటుంటాం. బీపీలు, షుగర్ లు వంటి ఏ రోగాలు లేకుండా హాయిగా మన పూర్వీకులు జీవించడానికి ప్రధాన కారణం వారు తీసుకున్న ఆహారం. గట్టి ఆహారం తీసుకున్నారు కాబట్టే ముసలివయస్సులో ఎంతో యాక్టివ్ గా ఉంటేవాళ్లు. మన పూర్వీకులు తిన్న ఆరోగ్యకరమైన వంటకాల్లో మెంతికూర గట్టి పప్పు ఒకటి. ఇది పోషకాల గని అని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. సాధారణ పప్పు కంటే ఇది కొంచెం గట్టిగా ఉండటం వల్ల దీనికి గట్టి పప్పు అని పేరు వచ్చింది. ఇది అన్నం, చపాతీ లేదా రోటీతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది. రుచికరమైన,ఆరోగ్యకరమైన మెంతికూర పప్పు తయారుచేయడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

మెంతికూర గట్టి పప్పు తయారీకి కావలసిన పదార్థాలు -కంది పప్పు - 1 కప్పు -మెంతికూర - 1 పెద్ద కట్ట -ఉల్లిపాయ - 1 మీడియం సైజు -టమాటో - 1 మీడియం సైజు -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ -పసుపు - 1/2 టీస్పూన్ -కారం - 1/2 టీస్పూన్ -ధనియాల పొడి - 1/2 టీస్పూన్ -జీలకర్ర పొడి - 1/4 టీస్పూన్ -ఆవాలు - 1/2 టీస్పూన్ -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె - 2 టేబుల్ స్పూన్లు -ఉప్పు - తగినంత -నిమ్మరసం - కొద్దిగా.

మెంతికూర గట్టిపప్పు తయారీ విధానం -ముందుగా కంది పప్పును శుభ్రంగా కడిగి కనీసం 30 నిమిషాల పాటు నీటిలో నానబెట్టండి. ఇలా చేయడం వల్ల పప్పు త్వరగా ఉడుకుతుంది, రుచిగా ఉంటుంది. -తర్వాత నానబెట్టిన పప్పును కుక్కర్ లో వేసి తగినంత నీరు, కొద్దిగా పసుపు వేసి 3-4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. పప్పు మెత్తగా ఉడకాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి కొద్దిగా నూనె వేడి చేసి తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు వేయించండి. -ఇప్పుడు తరిగిన టమాటో ముక్కలు వేసి మెత్తబడే వరకు ఉడికించండి. తర్వాత తరిగిన మెంతికూర వేసి అది మగ్గే వరకు ఉడికించాలి. మెంతికూర బాగా మగ్గితే దాని చేదు రుచి తగ్గుతుంది. -ఉడికించిన పప్పును పప్పు గుత్తితో మెత్తగా మాష్ చేసి..మగ్గిన మెంతికూర మిశ్రమంలో వేయండి. కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి,రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపండి. అవసరమైతే కొద్దిగా నీరు పోసి పప్పు గట్టిదనాన్ని సర్దుబాటు చేసుకోండి. -పప్పును మూత పెట్టి 5-7 నిమిషాలు తక్కువ మంట మీద మరిగించండి. ఇలా చేయడం వల్ల అన్ని రుచులు బాగా కలిసిపోతాయి.

## ఎగ్ బటర్ మసాలా..తిన్నారంటే మస్త్ మజా,ఎలా చేయాలంటే..



ఎగ్ బటర్ మసాలా తయారు చేయడానికి కావలసిన పదార్థాలు -గుడ్లు: 4 -కొత్తిమీర: కొద్దిగా -కసూరి మెంతి: 1 టీ స్పూన్ -కారం: 1 టీ స్పూన్ -ధనియాల పొడి: 1 టీ స్పూన్ -జీలకర్ర పొడి: 1/2 టీ స్పూన్ -గరం మసాలా: 1/2 టీ స్పూన్ -పసుపు: 1/4 టీ స్పూన్ -ఉల్లిపాయలు: 2 -టమాటాలు: 3 -అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టేబుల్ స్పూన్ -ఫ్రెష్ క్రీమ్ (మీగడ): 2 టేబుల్ స్పూన్లు -జీడిపప్పు: 10-12 -పచ్చిమిర్చి: 2 -నూనె లేదా నెయ్యి: 2 టేబుల్ స్పూన్లు -బటర్: 2 టేబుల్ స్పూన్లు -చక్కెర: 1/2 టీ స్పూన్ -ఉప్పు: తగినంత

### ఎగ్ బటర్ మసాలా తయారీ విధానం

-ముందుగా గుడ్లను బాగా ఉడికించి పొట్టు తీసి ఒక్కో గుడ్డును రెండు సమాన భాగాలుగా కోయాలి. మీరు కావాలంటే గుడ్డు సొనను తీసి పక్కన పెట్టుకోవచ్చు (దీనిని గ్రేవీలో వేసుకోవచ్చు). -తర్వాత వేడినీళ్లలో నానబెట్టిన జీడిపప్పును మిక్సీలో వేసి కొద్దిగా నీరు కలిపి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేడి చేసి అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత..తరిగిన టమాటాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి టమాటాలు మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి,లేదంటే అడుగంటుతుంది. -టమాటాలు మెత్తగా ఉడికిన తర్వాత కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, పసుపు,పచ్చిమిర్చి వేసి బాగా కలపాలి. మసాలాలు నూనెలో కాసేపు వేగితే మంచి సువాసన వస్తుంది. -ఇప్పుడు తయారు చేసుకున్న జీడిపప్పు పేస్ట్ ను అందులో వేసి బాగా కలపాలి. ఇది గ్రేవీకి మంచి చిక్కదనాన్ని ఇస్తుంది. ఒక నిమిషం పాటు ఉడికించాలి. -ఇప్పుడు అవసరమైన మేరకు నీరు పోసి, గ్రేవీని మీకు కావలసిన చిక్కదనానికి తీసుకురావాలి. తర్వాత రుచికి తగినంత ఉప్పు వేసి కలపాలి. -గ్రేవీ మరిగిన తర్వాత బటర్ లేదా వెన్న, గరం మసాలా వేసి బాగా కలపాలి. వెన్న కరిగే వరకు ఉడికించాలి. -తర్వాత నలిపిన కసూరి మెంతి, కావాలనుకుంటే కొద్దిగా చక్కెర వేసి కలపాలి. చక్కెర వేయడం అనేది ఆప్షనల్.. కానీ ఇది రుచిని బ్యాలెన్స్ చేస్తుంది.

## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

- కెసిఆర్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతాం
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, మే 19 : పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పు కొచ్చారు.

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

మొదటిపేజీ తరువాయి

అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ఆయన ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్, నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డిజిపి మహేశ్ భగవత్, ఎడిజి(ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టిజి జెన్కో సిఎండి హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

మొదటిపేజీ తరువాయి

సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులు పంపిణీ చేసారు. అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు, జిప్సం వాడకం ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు సాంకేతిక వివరాలు తెలియజేశారు. ఃార్యక్రమంలో భాగంగా వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినప్పటికీ వ్యవసాయంపై ఆసక్తితో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్న ఖమ్మం జిల్లా రఘునాథపల్లి రైతు మహేష్ తన అనుభవాలను వివరించారు. జిప్సం వాడకం ద్వారా క్షార ప్రభావిత భూముల్లో సాధించిన ఫలితాలను, ఉద్యాన పంటల్లో వచ్చిన లాభాలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి వివరించారు. అలాగే పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము సాగు ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించిన అనుభవాలను సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన మహేందర్, నిజామాబాద్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన సూర్యరెడ్డి రైతులతో పంచుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పంట దిగుబడుల్లో నేల ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందని, రైతులు భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో పచ్చిరొట్ట పంటలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 11,456 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్లు, ఇప్పటికే 10 జిల్లాల్లో 3,523 మెట్రిక్ టన్నుల జిప్సం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. బ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమం చివరలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రైతులు అడిగిన సాగు సంబంధిత సందేహాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమాధానాలు ఇచ్చారు.

## జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఎసిబి దాడులు

మొదటిపేజీ తరువాయి

మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించారు. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగించారు. దాదాపు రూ. 1.20 కోట్ల నగదు, 1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ప్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ప్రాథమికంగా 100 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గత నెలలో తన కుమార్తె వివాహాన్ని కుమార్ అంగరంగ వైభవంగా ఎంతో డబ్బులు వెచ్చించి మరీ జరిపించాడు. వివాహం కోసం కొన్ని కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు ఎలా సంపాదించారనే దానిపై కుమార్ వద్ద నుంచి ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## కవాడీగూడాలో దారుణ ఘటన

మొదటిపేజీ తరువాయి

మృతురాలు బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం కూడా భర్తతో గొడవపడిన దేబోరా.. విధుల కోసం స్పా సెంటర్‌కు వెళ్లింది. భార్య గొడవపడటంతో ఆగ్రహానికి గురైన భర్త.. కవాడిగూడ రత్నదీప్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్న స్పా సెంటర్‌కు వెళ్లాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచిపరారయ్యాడు. ఆపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకుని బంగి దేబోరా మృతుదేహాన్ని స్వాధీనంచేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వా స్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

మొదటిపేజీ తరువాయి

పుస్తకాలను అకాడమికి అందజేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అమిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమికి కృతజ్ఞతలు తెలిపారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమి డిజిటల్ క్లాసులు, ఇంక్యూబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అకాడమి భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమి లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణ మార్పులు అవసరమని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు మరియు గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మీడియా అకాడమి 1996 నుండి జర్నలిస్టుల అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని, పుస్తక ప్రచురణలు, మోనోగ్రాఫ్‌లు, శిక్షణా కార్యక్రమాలు మీడియా రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అభినందించారు. చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీ కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, డి. అమర్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్ ఎం.పీ., దిలీప్ రెడ్డి, మాదభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమి భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమి చేపడుతున్న కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు శాలువాలతో సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు.

## తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

మొదటిపేజీ తరువాయి

రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే పక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ఠ వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలో ని కిటాక్యూషు నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్దాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఆర్థిక విలువ సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజలు, స్థానిక సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో తెలంగాణ సుస్థిర పట్టణ నిర్వహణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా లతో సహా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

మొదటిపేజీ తరువాయి

పెరుగు తోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీ యతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా?

మొదటిపేజీ తరువాయి

ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క - సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## వీధికుక్కలను తరలించాల్సిందే

మొదటిపేజీ తరువాయి

తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

